


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 29 జనవరి 2026 15 పేజీలు





# మున్సిపల్ పోరు
# అభ్యర్థుల కరువు

- సిరిసిల్లలో ప్రధాన పార్టీలకు తప్పని తలపోటు
- బలమైన నేతల కోసం అన్వేషణ
- ఖర్చును చూసి జంకుతున్న అభ్యర్థులు
- గులాబీ కోటలోనూ అభ్యర్థుల కొరతేనా

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో సిరిసిల్ల పట్టణంలో రాజకీయ కోలాహలం మొదలైంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆశావహులు తమ తమ వార్డుల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈసారి ఎన్నికల చిత్రం విచిత్రంగా కనిపిస్తోంది. ఒకవైపు గెలుపు గుర్రాల కోసం పార్టీలు వెతుకుతుంటే, మరోవైపు పోటీకి దిగేందుకు అభ్యర్థులు వెనుకంజ వేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. 2లో



## మున్సిపల్ ఎన్నికలకు
# నామినేషన్ పర్వం ప్రారంభం

- రాజకీయ వేడి మొదలు
- తొలి రోజు నామినేషన్లు వేసిన అభ్యర్థులు

**సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నేటి నుంచి నామినేషన్ పర్వం అధికారికంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, రామగుండం నగర పాలక సంస్థలతో పాటు జమ్మికుంట, హుజరాబాద్, చొప్పదండి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, పెద్దపల్లి, మంథని, రాయికల్, ధర్మపురి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో నామినేషన్ల (మిగతా 2లో)







## అశీర్వదించండి...
# అభివృద్ధి చేస్తా



- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అశావాహుల హామీలు..
- గల్లిలో పెరిగిన అభ్యర్థుల ప్రచార సందడి..
- బల్దియాల్లో మొదలైన నామినేషన్ల పర్వం..
- తొలిరోజు స్వల్పంగానే నామినేషన్ల దాఖలు..

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి** 8లో

## కరీంనగర్ కార్పొరేషన్‌పై
# కాంగ్రెస్ జెండా ఖాయం

- జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గెలిచే అభ్యర్థుల ఎంపికలో సమిష్టిగా నిర్ణయం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- టికెట్ ఎవరికొచ్చినా అందరూ కలిసి గెలుపు కోసం పనిచేయాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కాంగ్రెస్ కార్పొరేటర్ ఆశావహులతో మంత్రుల ముఖాముఖి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి** 2లో



# సారలమ్మ రాకతో ప్రారంభమైన మహాజాతర

- నేడు సమ్మక్క రాక - మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- గ్రామాల్లో నిర్వాహకుల ఏర్పాట్లు

2లో

**సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో**



# మున్సిపల్ పోరు - అభ్యర్థుల కరువు

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డాగా పేరున్న సిరిసిల్లలో ఆ పార్టీ ఎన్నికల సమరానికి ముందే సిద్ధమైనట్లు కనిపిస్తున్నా, లోలోపల అభ్యర్థుల కొరత వేధిస్తోంది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ, కొన్ని వార్డుల్లో పోటీకి బలమైన అభ్యర్థులు దొరకకపోవడం గమనార్హం. కొన్ని వార్డుల్లో ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతుంటే మరికొన్ని వార్డుల్లో మాత్రం పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకపోవడం విచిత్రం. అయితే అభ్యర్థులు లేని వార్డుల్లో పార్టీ పట్టు కోల్పోకుండా ఉండటానికి నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. గెలుపు గుర్రాలను గుర్తించి బరిలోకి దింపేందుకు పావులు కదుపుతున్నారు.

**-హస్తం పార్టీలో అంతర్గత పోరు - సంస్థాగత బలహీనత**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, పట్టణంలో సంస్థాగత నిర్మాణం జరగకపోవడం, పెద్ద



నాయకుల మధ్య విభేదాలు పార్టీకి శాపంగా మారాయి. ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులను పార్టీలో చేర్చుకోకపోవడంతో మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటి అభ్యర్థులు కాంగ్రెస్లో కరువయ్యారు. బిఆర్ఎస్ అభ్యర్థులను ఢీకొట్టే సత్తా ఉన్న నేతలు లేకపోవడం కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. బిఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న సిరిసిల్ల మున్సిపాలిటీలో పాగా వేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలసిన రీతిలో సమాయత్తమైనట్లు కనిపించడం లేదు.

**- కమలం కౌంట్‌డౌన్:**

**39 వార్డులకు మూడో వంతు అభ్యర్థులే**

?కేంద్ర మంత్రి నియోజకవర్గ పరిధిలో ఉన్న సిరిసిల్ల మున్సిపాలిటీలో బిజెపికి కూడా అభ్యర్థుల గండం తప్పడం లేదు. మొత్తం 39 వార్డుల్లో కేవలం 8 నుండి 9 చోట్ల మాత్రమే బలమైన అభ్యర్థులు ఉండటం ఆశ్చర్యకరం. సరైన సమయంలో అభ్యర్థులను ప్రకటిస్తామని నాయకులు చెబుతున్నా, తెరవెనుక వేట కొనసాగుతూనే ఉంది.

**- అభ్యర్థుల జంకుకు ఆర్థిక భారమే కారణమా..**

ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు వెనకాడటానికి ప్రధాన కారణం ఆర్థిక భారం. ఎన్నికల ఖర్చు సామాన్యులకు అందనంత స్థాయికి చేరుకుంది. ఓటర్లను ఆకర్షించడం, ప్రచార ఖర్చులు భరించడం ఆర్థికంగా బలంగా ఉన్నవారికే సాధ్యమని భావిస్తున్నారు. దీంతో ప్రజాసేవ కంటే పైసలకే ప్రాధాన్యం పెరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఖాయం

**- జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు - గెలిచే అభ్యర్థుల ఎంపికలో సమిష్టిగా నిర్ణయం**

**- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు- టికెట్ ఎవరికొచ్చినా అందరూ కలిసి గెలుపు కోసం పనిచేయాలి**

**- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ - కాంగ్రెస్ కార్పొరేటర్ ఆశావహులతో మంత్రుల ముఖాముఖి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న కార్పొరేటర్ ఆశావహులతో మంత్రుల ముఖాముఖి సమావేశం బుధవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయం (ఇందిరా గార్డెన్స్)లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గెలిచే అభ్యర్థుల ఎంపికలో సమిష్టిగా నిర్ణయం తీసుకుంటామని, కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. టీఆర్ఎస్, బీజేపీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రాధాన్యత కలిగిన జిల్లాగా అభివర్ణించారు. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్?పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేసే బాధ్యత పార్టీదేనని హామీ ఇచ్చారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆశావహులకు సూచించారు. టికెట్ ఎవరికొచ్చినా అందరూ కలిసి గెలుపు కోసం పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర





వ్యవసాయ, సహకార, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారా యణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీం నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జిల్లా, నగర కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్ ఆశావహులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ పర్వం ప్రారంభం

(మొదటి పేజి తరువాయి)

స్వీకరణ మొదలైంది. మొదటి రోజే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి సంబంధిత ఎన్నికల కార్యాలయాలకు చేరుకుని డివిజన్ వారీగా నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. పలు చోట్ల అభ్యర్థుల నామినేషన్ దాఖలుతో మున్సిపల్ ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీలతో పాటు ఇతర రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లకు సిద్ధమవుతుండటంతో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో నామినేషన్ల సంఖ్య పెరగనుండగా, స్క్రూటినీ, ఉపసంహరణ అనంతరం అధికారికంగా అభ్యర్థుల జాబితా వెలువడనుంది. నామినేషన్ పర్వం ప్రారంభంతో పట్టణ రాజకీయాల్లో పోటీ వాతావరణం నెలకొనగా, రాబోయే రోజుల్లో ప్రచార కార్యక్రమాలు మరింత ఉద్ధృతం కానున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## సారలమ్మ రాకతో ప్రారంభమైన మహాజాతర

**- నేడు సమ్మక్క రాక**

**- మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు**

**- గ్రామాల్లో నిర్వాహకుల ఏర్పాట్లు**

**సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో**



తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన సమ్మక్క-సారలమ్మ మహాజాతర సారలమ్మ రాకతో ఘనంగా ప్రారంభమైంది. జాతర పండుగకు నాంది పలుకుతూ సారలమ్మను గద్దెలపై ప్రతిష్ఠించడంతో గ్రామగ్రామాన భక్తిశ్రద్ధలతో కూడిన సందడి మొదలైంది. గిరిజన సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ జాతరతో పరిసర గ్రామాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.జాతర సందర్భంగా గ్రామాల్లో సమ్మక్క,సారలమ్మ గద్దెలను అలంకరించి, భక్తులు బెల్లం మొక్కలు, నైవేద్యాలతో అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాలు, డోలు, పాటలతో గ్రామాల్లో ఉత్సవ వాతావరణం నెలకొంది. ఈ రోజు సమ్మక్క రాకతో జాతరలో అత్యంత ముఖ్యమైన ఘట్టంప్రారంభం కానుంది. సమ్మక్క గద్దెకు చేరుకునే వేళ భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శనాలకు తరలివస్తుండటంతో గ్రామాలు కిక్కిరిసిపోతున్నాయి. నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఈ మహాజాతర తెలంగాణ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది.

# జగిత్యాల మున్సిపాలిటీని ఎమ్మెల్యే సంజయ్ భ్రష్టు పట్టించారు

**- ఎమ్మెల్యేపై సంచలన వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల మున్సిపాలిటీని ఎమ్మెల్యే సంజయ్ భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఎమ్మెల్యేపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.జగిత్యాలను అవినీతికి కేంద్రంగా మార్చారని, ఏసీబీ దాడులు విజిలెన్స్ విచారణ మీ అభివృద్ధికి నిదర్శనం అని ఎద్దేవ చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ సీటు ఖాళీ అయితే, చట్టంలో లొసుగులు ఆసరాగా చేసుకొని బలహీన వర్గాల హక్కులు కాజేశారని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభించి రెండళ్లు అవుతున్న ఎందుకు వినియోగంలోకి తీసుకు రాలేదు అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా అభివృద్ధిని పట్టించుకోలేదు ఉన్నది మాట్లాడితే ఉలుకెందుకు అన్నారు. గత ఐదేళ్ల మున్సిపాల పాలక మండలీ పదవి కాలంలో 16 మంది మారటం తెలంగాణే కాదు దేశంలోనే ఎక్కడ ఈ పరిస్థితి ఉండదు.కమిషనర్లు పని చేయలేదని పంపించారా 8 మంది ఉద్యోగులు జైలు పాలు కావడం మీ పుణ్యమే అన్నారు.ఏసీబీ దాడులు విజిలెన్స్ దాడులు ఇదేనా మీ ప్రగతికి నిదర్శనం. మీరు ఎన్నుకున్న మీ పార్టీ చైర్పర్సన్ వేధింపులు తట్టుకోలేక మానసిక క్షోభ తో రాజీనామా చేయడం కళ్ళ ముందు జరిగింది అని గుర్తు చేశారు. నేను అడ్డుకుంటున్నానని ఆరోపనలు చేయడం హాస్యాస్పదం. ఎల్ ఎల్ గార్డెన్ రోడ్డు ప్రాధాన్యతను అక్రమ నిర్మాణాలు ఆపేందుకు మార్కింగ్ చేయాలని రెండేళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కొత్తగా కాలేదు పదేళ్ల నుండి అధికారంలో ఉన్నావు కదా నేను ఎమ్మెల్యే గా ఉన్న కూడా అధికారులు మీ మాటే వినాలని ఓపెన్ గా మీ పార్టీ వారు చెప్పారు కదా పదేళ్ల నుండి అభివృద్ధి చేస్తే ఎవరు అడ్డుకున్నారు అన్నారు. విమాన



ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.అజిత్ పవార్ రైతు నాయకుడు.ఆయన మృతి యావత్ సమాజానికి తీరని లోటు అన్నారు.

## సిరిసిల్లలో మొదలైన మున్సిపల్ నామినేషన్ల పర్వం

**- తొలిరోజే బారులు తీరిన అభ్యర్థులు - 39 వార్డుల కోసం 13 స్టాల్స్ ఏర్పాటు**

**- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఇంచార్జ్ కలెక్టర్, డీఎస్పీ**



**సూర్య రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. బుధవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం అభ్యర్థులు, వారి అనుచరులతో సందడిగా మారింది. 39 వార్డులకుగాను కౌన్సిలర్ పదవుల కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు తొలిరోజే నామినేషన్లు వేసేందుకు ఉత్సాహం చూపారు.

**- పకడ్బందీగా ఏర్పాట్లు**

నామినేషన్ల స్వీకరణ కోసం అధికారులు మున్సిపల్ కార్యాలయంలో మొత్తం 13 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగుతుందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం వరకు నిర్విఘ్నంగా సాగింది. శాంతి భద్రతల దృష్ట్యా సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి, పట్టణ సిఐ కృష్ణ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

**- తప్పని 'నో డ్యూ' తిప్పలు**

ఒకవైపు నామినేషన్ల సందడి కనిపిస్తుండగా, మరోవైపు అభ్యర్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు, వారిని ప్రతిపాదించే వ్యక్తులు తప్పనిసరిగా సమర్పించాల్సిన 'నో డ్యూ సర్టిఫికెట్' కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. సమయం తక్కువగా ఉండటం, అభ్యర్థులు ఒక్కసారిగా తరలిరావడంతో సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలో అధికారులు తడబడ్డారు. సరైన కౌంటర్లు లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**- సౌకర్యాల కరువుపై అసహనం**

మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అభ్యర్థులు, మహిళలు, మీడియా ప్రతినిధులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి. కనీసం తాగునీరు, కూర్చునేందుకు వసతి లేకపోవడంతో ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీగా జనసందోహం ఉన్నప్పటికీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంపై అభ్యర్థులు అసహనం వ్యక్తం చేశారు.





## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



**సూర్య చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని గ్రామపంచా యతీలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కార్యవర్గానికి చిరు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన ప్రెస్ క్లబ్ కార్యవ ర్గాన్ని, అలాగే టియుడబ్ల్యూజే రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అజీమ్‌ను సర్పంచ్ పులి సత్యం, ఉప సర్పంచ్ బత్తుల క్రాంతిలు సన్మానించారు, అనంతరం సర్పంచ్ పులి సత్యం మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా లింగాల తిరుమల్ ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉన్నదని ఫోర్త్ పిల్లర్‌గా చెప్పుకునే మీడియా ప్రతి సమస్యను కళ్లకు కట్టినట్టుగా ప్రజలకు ప్రభు త్వానికి ఒక వారధిగా చూపిస్తుందని అన్నారు. చందుర్తి గ్రామ అభివృద్ధిలో మీడియా సహాయ సహకారాలు అందించాలని ఏ సమస్య ఉన్న పరిష్కరించుకొని అభివృద్ధిలో ముందుకు వెళ తామని అన్నారు. మీడియా మిత్రులు కూడా సమస్యలన్నీ మా పాలకవర్గానికి తెలియజేసిన ట్లయితే ప్రజల్లో ఉన్న సమస్యలను తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు. అలాగే చందుర్తి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తిరుమల్ మాట్లాడుతూ చందుర్తి సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సన్మానించడం ఆనందంగా ఉన్నదని ప్రజల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో మీతో పాటు ముందుండి పనిచేస్తామని, గ్రామ అభివృద్ధిలో మా ప్రెస్ క్లబ్ కార్యవర్గం మీతో పాటు పనిచేస్తున్నదని అధ్యక్షులు తిరుమల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం, గౌరవ అధ్యక్షులు లింగాల లింగయ్య, ఏనుగుల కృష్ణ, ఉపాధ్యక్షులు రాజూరి విష్ణు కుమార్,ప్రధాన కార్యదర్శి మ్యకల కొమురయ్య, యాకోబ్, మధు, బొట్ల వారు శ్రీనివాస్, రాజూరి సద్గుణ చారి,రాజూరి రఘురామ్, కార్తీక్ నిశాంత్, అలాగే వార్డు సభ్యులు మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీలు ప్రారంభం...

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మోడల్ స్కూల్లో 'సీఎం కప్' క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, ఇన్ ఛార్జ్ ఎంపీడీవో శ్రీలేఖ, తహశీల్దార్ ముక్తార్ పాషా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు నాయకులు అధికారులు ఉన్నారు.

## ఆటో డ్రైవర్ కు దొరికిన బంగారు ఉంగరం

**- నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్ రాజేష్**

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలంలో ఒక ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నారు.ఆటోలో ప్రయాణికులు పోగొట్టుకున్న అరతులం బంగారు ఉంగరం పోగొట్టుకున్న యజమా నికి అప్పగించి ఆటో డ్రైవర్ అభినందనలు అందుకున్నాడు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు జరుగుతునందున ఆటోలో దేవాలయం వద్దకు ప్రయాణికులు వెళ్లడంతో బంగారు ఉంగరం ఆటోలో పడిపోయింది.ఆటోలో దొరికిన ఉంగరాన్ని ఆటో డ్రైవర్ రాజేష్ ఆలయ కమిటీ అధ్యక్షుడు చేకూరి దేవయ్య, సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల-శంకర్ రెడ్డిలకు అందించారు. వెంటనే పోగొట్టుకున్న యజమానికి ఆ ఉంగరాన్ని అందించారు. నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ ను ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపన్నగారి మాధవి లత

**- ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**సూర్య, వేములవాడ**



వేములవాడ మున్సిపల్ 28 వార్డుకు చెందిన గోపన్నగారి మాధవి లత బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని విప్ సూచించారు.గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని విస్మరించిందని అన్నారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

## వాహన దారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**- లింగన్నపేటలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలపై అవగాహనా**

**- జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్**

**సూర్య గంభీరావుపేట**



ప్రతి ఒక్క వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ సూచించారు. బుధవారం గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో పాల్గొని వాహనా దారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై అనిల్ కుమార్, లింగన్నపేట అనంత, శ్రీ గ్రూప్ అఫ్ ఇన్స్టిట్యూషన్స్ చెర్మన్ రాధాకృష్ణ శర్మ, పోలీస్ సిబ్బంది, శ్రీ సాయి స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా వార్డు సభ్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గా అమ్మిగల్ల గోపాల్

**సూర్య బోయినపల్లి**



మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యులు అమ్మిగల్ల గోపాల్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులుగా నియామకమైన అమ్మిగల్ల గోపాల్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని జిల్లాలో ఉన్న వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ముందుండి వారికి సేవకుడిలా ఉంటానని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులుగా నా నియామకానికి కృషి చేసిన రాష్ట్ర వార్డు సంక్షేమ సంఘం అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెస్రం నర్సయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్ని మండలాల్లో త్వరలో కమిటీలు వేస్తామని తెలిపారు.

## వేములవాడ మున్సిపల్‌లో 16 నామినేషన్లు దాఖలు

**సూర్య, వేములవాడ**



వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో మొదటి రోజు దాఖలైన మొత్తం నామినేషన్లు 16 దాఖలు అయ్యాయి. కాంగ్రెస్-8, బీజేపీ-3, బీఆర్ఎస్-5, ఇండిపెండెంట్-0 దాఖలు అయ్యాయి.



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
జగిత్యాల


# ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలి

**- కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**- నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి -నామినేషన్ కేంద్రాల పరిశీలన**

**సూర్య మెట్‌పల్లి**

మున్సిపల్‌లో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. బుధవారం మెట్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్‌ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరుగుతోందా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. నామినేషన్‌లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి



అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉండేల చూసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్‌ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం కప్ 2025 మున్సిపల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

సీఎం కప్-2025 మున్సిపల్ స్థాయి క్రీడా పోటీలు జగిత్యాలలోని వివేకానంద స్టేడియంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో జగిత్యాల్ అర్బన్ మండల ఎంఈఓ డి.చంద్రకళ, డీవైఈఓ ఓ.రవికుమార్, రాష్ట్ర పరిశీలకులు ఓంకార్ నాథ్ యాదవ్ వారి బృందం పాల్గొని పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కప్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. అన్నాడుని కజ్జరిన్ వంటి అంతర్జాతీయ క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచే ఇలాంటి కప్ పోటీల ద్వారా



ఎంపికై, నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అందువల్ల సీఎం కప్ పోటీలు క్రీడాకారుల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని వారు అన్నారు. అనంతరం ఎంఈఓ చంద్రకళ మాట్లాడుతూ, క్రీడల వల్ల మానసిక మరియు శారీరక దృఢత్వం పెరుగుతుందని, అలాగే క్రీడల ద్వారా ఎన్నో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సీఎం కప్ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి, ఉత్తమ క్రీడాకారులుగా ఎంపిక కావాలని ఆమె క్రీడాకారులను ప్రోత్సహించారు. నిర్వహించిన కబడ్డీ, కోకో వాలీబాల్ పోటీలలో మున్సిపల్ పరిధిలోని దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, జగిత్యాల అసెంబ్లీ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈడీలు రమేష్, కవితారాణి, శ్రీరామ్ రియాజ్ అజీజ్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలి

**- నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**- నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**సూర్య కోరుట్ల టౌన్**



కోరుట్ల మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా,పారదర్శకంగా జరుగుతోందా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని రకాల ఫామ్స్ అందుబాటులో ఉండేల చూసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి,కోరుట్ల ఆర్డీఓలు శ్రీనివాస్,జివాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు,ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

**సూర్య, హుజురాబాద్**

హుజురాబాద్ పట్టణానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు వారి పార్టీలకు రాజీనామాలు చేసి హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చి వారు పార్టీలో చేరారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో హుజురాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ హస్త గతం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మిడిగిరి వినీత, గన్నారపు శ్రీకాంత్, గన్నారపు లక్ష్మీనారాయణ, వడ్లకొండ కిరణ్, పోలు రాజయ్య, మోహన్, కృష్ణ ప్రసాద్, రవీందర్, అరుణ, బద్దుల గోపికృష్ణ లు చేరారు.

## సైబర్ నేరాలు ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సూర్య మేడిపల్లి**





ఆర్.బి.ఐ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి వారి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు అనే అంశంపై బుధవారం రోజు భీమారం గ్రామంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మేడిపల్లి ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా యువత సైబర్ నేరాల బారినబడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ ఆప్‌ల వల్ల సైబర్ నేరాలకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఏపీకే ఫైల్స్‌లను డౌన్లోడ్ చేయవద్దని, డిజిటల్ అరెస్ట్ అంటూ వచ్చే ఫోన్ కాల్‌లకు భయపడవద్దని, యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనట్లు తెలిసిన వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమారం గ్రామ సర్పంచ్ స్వాతి సంజీవ్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి కౌన్సిలర్‌లు నవీన్, మేఘమాల, భీమారం గ్రామ ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెంచికల్ పేట్ లో గద్దెకు చేరిన సారక్క

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ లో వనదేవతల జాతర ఉత్సవ వేడుకల్లో భాగంగా మొదటి రోజు సారక్క గద్దె కు చేరుకుంది. కోయ పూజారులు గద్దె మీద ప్రతిష్టించారు. అలాగే పగిడిద్ద రాజు, గోవింద రాజు లు కూడా గద్దె కు చేరుకున్నారు. భక్త జనుల, డప్పు చప్పుళ్ల కోలాహలం మధ్య కోయ పూజారుల పూనకాలతో వన దేవతలను తీసుకువచ్చి ప్రతిష్టించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## మొదటి రోజు ప్రశాంతంగా జరిగిన నామినేషన్ ప్రక్రియ

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలకు జరుగనున్న ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 64 నామినేషన్‌లు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీల వారిగా ధర్మపురి-10, జగిత్యాల-21, కోరుట్ల-07, మెట్పల్లి-17, రాయికల్-9 నామినేషన్లు దాఖలు చేసినట్టు వివరించారు.

## మేడిపల్లిలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

**సూర్య మేడిపల్లి**



సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణలో భాగంగా బుధవారం రోజు మేడిపల్లి మండల స్థాయి ఆటల పోటీలను మేడిపల్లి గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించినట్లు స్థానిక ఎంపీడీవో అంజుమ, మండల విద్యాధికారి ఆకుల లక్ష్మీ నర్సయ్య తెలిపారు. ఈ నెల 30వ తేదీ శుక్రవారం బాలికలకు, మహిళలకు, బాలురకు, పురుషులకు కో కో, కబడ్డీ, వాలీబాల్ అథ్లెటిక్స్‌లలో నియోజకవర్గ పోటీలకు ఎంపిక నిర్వహించబడునని తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక నిర్వహణ జరపబడుతుందని అన్నారు. పాల్గొనేవారు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని, ఆన్లైన్ కాపీని, ఆధార్ కార్డులను తీసుకొని రావాలని అన్నారు. ఇతర వివరాల కొరకు మండల క్రీడా నిర్వహణ కన్వీనర్ పుష్పలతను సంప్రదించవలసిందిగా కోరారు.

## నేడు, రేపు మండల కేంద్రంలో సింఎం కప్ క్రీడలు

**- మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్**

**సూర్య-కథలాపూర్**

నేడు, రేపు సిఎం కప్ క్రీడలను మండలంలోని ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో నిర్వహిస్తు న్నట్టు బుదవారం మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మండలంలోని వివిధ గ్రామాల నుండి క్రీడల్లో పాల్గొనడానికి దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులకు బాలికల విభాగంలో గురువారం, బాలుర విభాగంలో శుక్రవారం ఖోఖో, కబడ్డీ,వాలీబాల్, అథ్లెటిక్, ఇతర క్రీడలను నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## రాయికల్ మున్సిపల్‌లో తొమ్మిది మంది నామినేషన్లు

**సూర్య, రాయికల్**

రాయికల్ మున్సిపల్‌లో తొమ్మిది మంది నామినేషన్లు వేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఇట్టి నామినేశన్ ప్రక్రియలో 8వ వార్డ్‌లో పల్లికొండ గంగాధర్ కాంగ్రెస్ పార్టీ (ఎమ్మెల్యే వర్గం), 2. మచ్చ నారాయణ బిజెపి పార్టీ 5వ వార్డ్, వల్ల కొండ సంధ్య టిఆర్ఎస్ పార్టీ 10వ వార్డ్, ఆడెపు ప్రశాంతి బిజెపి పార్టీ 4వ వార్డు, తురగ సౌజన్య బిఆర్ఎస్ పార్టీ 2వ వార్డు, సుంటి గీకర్ రాము బిజెపి పార్టీ 10వ వార్డు, మచ్చ గంగ లక్ష్మి కాంగ్రెస్ పార్టీ 6వ వార్డు, పిప్పాజీ సునీత 12 వ వార్డ్, 9 వ వార్డు మొర దిరాజ్ లు నామినేషన్ వేశారు

## మండల స్థాయిలో "సీఎం కప్"సెలక్షన్

**సూర్య వెల్లటూర్**

వెల్లటూర్ మండల స్థాయిలో సీఎం కప్ సెలక్షన్ ను మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 30వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల క్రీడాకారులు తమ రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆన్లైన్ టికెట్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ఆ రోజు ఉదయం 9గంటలకు జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందులో నిర్వహించు క్రీడలు కోకో,కబడ్డీ,వాలీబాల్, అథ్లెటిక్స్,ఇతర క్రీడా ఎంపికలు జరుగుతాయని ఎంఇఓ తెలిపారు. పూర్తి వివరాలకు పీడీ రాజుకుమార్ మొబైల్ 7337096642ను సంప్రదర్శించాలన్నారు.





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

పెద్దపల్లి

గురువారం 29 జనవరి 2026




## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందుకు వెళుతుంది

### -ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు వాస్తవ దూరం -మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**సూర్య-గోదావరిఖని**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ప్రాంతానికి వచ్చిన ఆయన రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలపై వారి సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణికి సంబంధించిన నైని బొగ్గు బ్లాక్ టెండర్ లలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం కూడా వాస్తవం లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా ఎటువంటి నిబంధనలు తీసుకురాలేదని, గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ నిబంధనల నే



ఎనర్జీ మినిస్టర్ భట్టి విక్రమార్క అమలు చేశారని చెప్పుకొచ్చారు. ఈ విషయాలపై స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరణ ఇచ్చినప్పటికీ హరీష్ రావు, కేటీఆర్ తో పాటు కిషన్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే ఆలోచనల ను ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ వారు స్వస్తి పలికాలని హితవు పలికారు. నలుగురం మంత్రులం సాధారణంగా కలిసి మా మాట్లాడుకోవడాన్ని కూడా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సహ చర మంత్రులందరం కలిసి పని చేయడం జరుగుతుందని ఇందులో ఎటువంటి అపోహలకు తావు లేదని మంత్రి శ్రీధర్ బాబు మరో మారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని రాబోయే మూడేళ్లే కాకుండా, మళ్లీ ఐదేళ్లు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు జరగబోయే ఎన్నికల్లో లో కాంగ్రెస్ పార్టీ 60 కి 60 స్థానాలు కైవసం చేసుకునే దిశగా ముందుకు వెళ్లడం జరుగుతుందని చెప్పారు. గతంలో ఎన్నడూ జరిగిన అభివృద్ధి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలో జరుగుతుందని, ప్రజల ముందు కనిపిస్తున్న అభివృద్ధే రేపటి తమ గెలుపుకు నాంది అవుతుందని అన్నారు. ప్రతిపక్షాలు బట్ట కాల్చి మీద వేసే ధోరణిలో తమ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే పనులు చేస్తున్నారని, ప్రజలు వారు చెప్పే తప్పుడు మాటలను నమ్మరనే విశ్వాసం తనకు ఉందని అన్నారు.

## రామగుండం ను మాంచెస్టర్ ఆఫ్ సిటీ గా పునర్నిర్మాణం చేసుకుందాం

### - శాసనసభ్యులు రాజ్ ఠాకూర్

**సూర్య-గోదావరిఖని**

మాంచెస్టర్ ఆఫ్ సిటీ గా పేరు గడించిన రామగుండం పారిశ్రామిక ప్రాంతం గత పాలకుల నిర్లక్ష్యానికి గురై సిటీ అనే పదాన్ని కోల్పోయిందని, మళ్లీ ఇప్పుడు మాంచెస్టర్ ఆఫ్ సిటీగా మార్చేందుకు జరుగుతున్న రామగుండం నియోజకవర్గ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి స్థానిక రామగుండం శాసన సభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ వారు ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ప్రకృతి ప్రసాదించిన



వనరులు అందుబాటులో ఉన్నా కూడా దశాబ్దాల కాలంగా రామగుండం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల కాలం తర్వాత రామగుండం నియోజకవర్గంలో మార్పు ఇప్పుడే మొదలైందని రాబోయే రోజుల్లో ఘనమైన అభివృద్ధిని ప్రజల ముందు ఆవిష్కరిస్తానని స్పష్టం చేశారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సభ్యుల సంక్షేమానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు గుంతల రాజేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాధవరావు, ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యాం కుమార్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు అల్లంకి లక్ష్మయ్య, వేల్పుల నారాయణ, లక్ష్మయ్య, కోల లక్ష్మణ్, మాదాసు రామమూర్తి, జీవన్ బాబు నిట్టూరి, పూదరి కుమార్, పందిళ్ళ శ్యాంసుందర్, చంద్రశేఖర్ రెడ్డి, తగరపు శంకర్, జక్కం సత్యనారాయణ, రామ్ శంకర్, సత్యం, గోలి సమ్మిరెడ్డి, పాలకుర్తి విజయ్ కుమార్, వాసు, శేఖర్, గంట రవి, శంకర్, కుమార్, కిషన్, చందుపట్ల తిరుపతిరెడ్డి, రంగు తిరుపతి, రామ్ దేని సదానందం, దబ్బెట శంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

### - భక్త జనసంద్రంతో నిండిన నీరుకుల్ల జాతర

**సూర్య: సుల్తానాబాద్**



వనం విడిచి జనం లోకి వచ్చిన వన దేవతల సారలమ్మ గద్దెపై కొలువుదీరారు. మండలం లోని నీరుకుల్ల లో బుధవారం బిడ్డ సారలమ్మ గద్దెకు చేరుకుంది. రంగ నాయకుల గుట్ట నుండి కోయ పూజారులు కుంకుమ భరణి లో వన దేవతలకు తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ప్రాంగణంలో సమ్మక్కసారలమ్మ లు గద్దెలకు చేరుకోవడంతో శివ సత్తుల పోనకాలు, డప్పు చప్పుళ్ళు తో మారుమ్రోగింది. భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చి నిలువెత్తు బంగారం సమర్పించుకుని దేవతలను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. నీరుకుళ్ళ జాతర భక్త జన సంద్రం తో నిండిపోయింది. వన దేవతలకు దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సిఐ సుబ్బారెడ్డి , ఎస్సైలు చంద్రకుమార్, అశోక్ రెడ్డి , పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ లో పాల్గొని భక్తులకు దర్శనం లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటీ చైర్మన్ పొన్నం చంద్రయ్య గౌడ్ పలు చర్యలు తీసుకున్నారు.

## నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**




నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశామని అన్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో వచ్చిందని కలెక్టర్ తెలిపారు. బుధవారం నుంచి జనవరి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తున్నామని అన్నారు. పెద్దపల్లి, మంథని సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్యాలయాలలో నామినేషన్లు స్వీకరిస్తున్నామని, రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించి నామినేషన్ స్వీకరణ కోసం 8 సెంటర్లను ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 124 వార్డుల పరిధిలో 62 రిటర్నింగ్ అధికారులు, 62 అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎలక్షన్ అబ్జర్వర్లు పద్మజ రాణి, సుజాత, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## 12 వాహనాలు...1592 దరఖాస్తులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్జీ-3 డివిజన్ లో వివిధ వాహనాలకు జీఎం కార్యాలయం లో బుధవారం అధికారులు డ్రా తీశారు. 12 వాహనా లకు.1592 మంది నిర్వాసితులు టెండర్లు వేశారు. దీంతో జీఎం సుంకర మధుసూదన్ ఆదేశాలతో ఎస్వోటు జీఎం ఏం.రాంమోహన్, పర్సనల్ డిజిఎం బెరుగు సుదర్శన్, పర్చేస్ ఎస్ఈ వి.రాజా రవిచరణ్, ఫైనాన్స్ డిజిఎం సిజె.సురేఖ, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఎండి.షబీరుద్దీన్ పాల్గొన్నారు.

## 31న క్రీడాకారులు హాజరు కావాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



సీఎం కప్- 2026 మండల సాయి క్రీడల కోసం ఆన్లైన్ చేసుకున్న వారు ఈ నెల 31న ఉదయం 9.00 గంటలకు కమాన్ పూర్ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో హాజరుకావాలని ఎంపీడీవో సాధినేని ప్రియాంక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ కొరకు 24 వాలీబాల్ 32 కోకో 15, అథ్లెటిక్స్ 28 మంది ఆన్లైన్ చేసుకోవడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఆధార్ కార్డు తో సహా హాజరు కావాలని కోరారు. ఏదైనా వివరాలు కావాల్సి వస్తే 8919942159, మరియు 7702543976 లకు సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

## నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో శైలజారాణి

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం పన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీని బుధవారం రామగిరి ఎంపీడీవో బద్రి శైలజరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి నర్సరీలో కొత్త మొక్కల పెంపకం తో పాటు, గత సంవత్సరం మొక్కలను బ్యాగ్ లోకి మార్చడం జరుగుతుందని తెలిపారు. నర్సరీ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిందం మహేష్, ఇంచార్జ్ ఏపీఓ వరకాల మౌనిక, ఈసీ మల్క .అఖిల, సెక్రటరీ భూక్య ప్రేమలత, వన సేవకులు కుంట కుమారస్వామి పాల్గొన్నారు.

## అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు

**సూర్య, సెంటినరీ కాలనీ**

పెద్దపల్లి జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు ఇరుగు రాళ్ల భాగ్యలక్ష్మి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి కి ఇటీవల పెద్దపల్లి జిల్లా మానిటర్ ఇన్ కమిటీ సభ్యురాలుగా నియామకం జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు మంథనికి రాగా భాగ్యలక్ష్మి మంత్రి శ్రీధర్ బాబును కలవగా ఆమెను శాలువాతో సత్కరించి శ్రీధర్ బాబు అభినందించారు. ప్రజలకు సేవ చేయాలని శ్రీధర్ బాబు సూచించారు. అభినందించిన మంత్రి శ్రీధర్ బాబుకు భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.



# నిజాయితీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

## - మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలు చేయాలి - ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సూర్య, రాజన్న సిరిసిల్ల**



మున్సిపల్ ఎన్నికలలో అధికారులు విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల విధులపై జోనల్ ఆఫీసర్స్, ఎఫ్ ఎస్టీ, ఎస్ ఎస్టీ టీంలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికీ సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదని స్పష్టం చేశారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, వీడియో రికార్డు చేయడం చాలా కీలకమని, ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. వీటికి సంబంధించిన అన్ని వివరాలతో సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని సూచించారు. నగదు సీజ్ చేసే సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని పేర్కొన్నారు. నగదు సీజ్ చేసిన సమాచారం ఐటీ అధికారులకు ఇవ్వాలని సూచించారు. సభలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, కుర్చీలు, భోజనం తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ప్రచార వాహనాలకు మున్సిపల్ కమిషనర్లు, లౌడ్ స్పీకర్లకు పోలీస్ ల నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు సమీప ఎస్ హెచ్ ఓ ల నుంచి ఎన్ఓసీ తీసుకున్న తర్వాత మున్సిపల్ కమిషనర్ అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి వార్డు సభ్యుడు రూ. లక్ష వరకు ఎన్నికల వ్యయం చేయవచ్చని వెల్లడించారు. జోనల్ ఆఫీసర్స్ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మూడు సార్లు తనిఖీ చేయాలని సూచించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్, టాయిలెట్స్ విని యోగంలో ఉన్నాయా చూడాలని ఆదేశించారు. దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల రోజున అధికారులు, సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని తెలిపారు. స్థానికేతరులు ఇక్కడ ఉండకుండా చూడాలని సూచించారు. పోలింగ్ రోజున డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సిబ్బంది జోనల్ ఆఫీసర్స్ తో పాటు వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. ప్రతి రోజు అన్ని టీంలు నివేదికలను జిల్లా అధికారులు, పోలీస్ అధికారులకు పంపాలని సూచించారు. అనంతరం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్ని కలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, నోడల్ అధికారులు గీత, శ్రీనివాసాచారి, నవీన్, ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్య స్వామికి ఫలపంచామృతాభిషేకం

**సూర్య, కరీంనగర్**



కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ నగునూర్ లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలోని ఉమాసుతుడైన శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారలకు ఫల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం చేసారు. అనంతరం స్వామి వారలకు నూతన వస్త్రాలంకరణ చేసి విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

## శిశు మందిర్‌లో సూర్యనమస్కారాల పోటీ

**సూర్య, కరీంనగర్ టౌన్**



రథసప్తమి సందర్భంగా శిశు మందిర్‌లో జనవరి 20 నుంచి 27 వరకు సూర్యనమస్కారాల సప్తాహం నిర్వహించారు. ముగింపు రోజున జరిగిన పోటీలో 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారు. 1600 పైగా సూర్యనమస్కారాలు చేసి బొజ్జ అక్షిత ప్రథమ, మనుపాటి ప్రియహర్షిణి ద్వితీయ, బూత్కూరి లసిక తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు దరఖాస్తులకు ఆహ్వానం

**సూర్య, చిగురుమామిడి**



చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్లో 6నుండి 8వ తరగతి వరకు సాంఘిక శాస్త్రమును ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు(గంటల ప్రాతిపదికన) ఎస్.బి.టి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ హర్జిత్ కౌర్ తెలిపారు. బిఏ, బికం, బి.ఈడి, టెట్ క్వాలిఫై అయిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 29నుండి 31వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 02న డెమో ఉంటుందని తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

### - కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి

**సూర్య, కరీంనగర్**



కరీంనగర్ రూరల్ మండలం నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల ప్రజలకు తెలియజేయునది ఏమనగా, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని పౌరులకు తెలియజేశారు. ఎన్నికల మార్గదర్శకాలను అందరూ ఖచ్చితంగా పాటించాలని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ లేదా స్వీకరణ, ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు ఎన్నికల చట్టాల ప్రకారం తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధ కాలంలో మద్యం అమ్మకం, రవాణా, వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అలాగే ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏ ప్రయత్నమైనా చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని, బెల్టుషాపులు, మాదకద్రవ్యాల విక్రయం, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఓటు ప్రజాస్వామ్యంలో విలువైన హక్కు అని పేర్కొన్న సీఐ నిరంజన్ రెడ్డి, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, న్యాయంగా, ఎలాంటి భయం లేదా ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## అసిస్టెంట్ లోకోపైలట్‌కు అభినందన

### - అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్

**సూర్య, రామడుగు**



రామడుగు మండలం వెలిచాల సరస్వతి హైస్కూల్ పూర్వ విద్యార్థి ఎముండ్ల రాజు రైల్వేలో అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగం సాధించినందుకు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ బుధవారం అభినందించారు. 2017-18లో పదో తరగతి పూర్తి చేసిన రాజు హైదరాబాద్‌లో డిప్లొమా బీటెక్ పూర్తిచేసి గతేడాది రైల్వే ఉద్యోగానికి ఎగ్జామ్ రాశాడు. ఇటీవలి ఫలితాల్లో రాజు అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం టీచర్స్ రాజును అభినందించారు.

## కాంగ్రెస్ అగ్రనేతలకు ఘన స్వాగతం

**సూర్య, తిమ్మాపూర్**



ముంజంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు లు ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ వద్ద ఘనస్వాగతం లభించింది. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి శాలువాలు కప్పి, పుష్ప గుచ్ఛాలు అందించి వారికి స్వాగతం పలికారు. అలాగే వీరికి స్వాగతం పలికిన వారిలో పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బండారి రమేశ్ గౌడ్, ఒగ్గు దామోదర్, బత్తిని



శ్రీనివాస్ గౌడ్, మామిడి అనిల్ కుమార్, కర్ర సత్య ప్రసన్నారెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, జ్యోతి, కె.పద్మ,సిహెచ్ పద్మ, గూడెల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సిపి గౌస్ ఆలం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గానికి జరిగే రెండవ సాధారణ ఎన్నికల్లో స్వీకరిస్తున్న నామినేషన్ కేంద్రాలను బుధవారం జిల్లా సిపి గౌస్ ఆలం సందర్శించి తనిఖీ చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లు ఇతర ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేసే సందర్భంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ వేయడానికి అనుమతి ఉన్నవారినే లోపలికి పంపిస్తారని ఆయన అన్నారు. భద్రతా పరమైన చర్యల గురించి హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపి వెంట ఏసిపి మాధవి, హుజురాబాద్ టౌన్ సిఐ టి. కరుణాకర్, ఎస్ఐ యూనస్ అలీ, కమిషనర్ ముసబ్ అహ్మద్, భూపాల్ రెడ్డి, మాధవ రావు, అశ్విని గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని తాసిల్దార్‌కు వినతి

**సూర్య, రామడుగు**



రాముడు మండలం దేశరాజుపల్లి గ్రామంలో 407/2లో 1.31 గుంటల ప్రభుత్వ భూమిని (సీలింగ్) రియల్టర్ల కబ్జా నుండి కాపాడి గ్రామ ప్రజల అవసరాల కోసం కేటాయించాలని గ్రామ ప్రజలు వినతిపత్రం అందించారు. ఈ భూమి ప్రధాన రహదారికి సమీపంలో ఉండడంతో కోట్లు విలువ ధరపై పలుకుతుంది. ఈ భూమి సీలింగ్ యాక్ట్ వచ్చిన తర్వాత గ్రామానికి చెందిన కొంత మంది నిరుపేదలకు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. తదనంతరం ఈ భూమిని వీరు విక్రయించుకోవడంతో గ్రామానికి చెందిన కొంతమంది రాజకీయ నాయకులు రియల్ వ్యాపారస్తులతో కలిసి ప్లాట్లుగా చేసి కోట్లు దండుకొని అమాయక ప్రజలను మోసం చేస్తూ ఉన్నారని వినతిపత్రంలో అందించారు. కబ్జా చేసుకున్న రియల్ వ్యాపారస్తుల నుండి స్వాధీనం పరుచుకుని గ్రామ అవసరాల కోసం కేటాయించాలని తాసిల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు అమిరిశెట్టి సుధాకర్ తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

**సూర్య, కరీంనగర్**



జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ర్యాండమైజేషన్ విధానంలో మొదటి దశ సిబ్బంది కేటాయింపు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పూర్తయింది. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియ అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడేతో కలెక్టర్ సమీక్షించారు. ఎన్నికలు జరిగే పట్టణాల్లో, నగరంలో బ్యాలెట్ బాక్సులు, విధులు నిర్వహించే సిబ్బంది, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు.

# వీణవంకలో మిన్నంటిన జయజయధ్వానాలు

**- గద్దెపైకి చేరిన సారలమ్మ... - వైభవంగా మినీ మేడారం జాతర...**
**- భారీ బందోబస్తు మధ్య వనం నుండి జలంలోకి వనదేవత**
**- మేళతాళాల మధ్య గద్దెనెక్కిన సారలమ్మ**

**సూర్య, వీణవంక**

కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన ఇక్కడి సమ్మక్క- సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం ప్రధాన ఘట్టం ఆవిష్కృతమైంది. కోయ పూజారుల నృత్యాలు, డప్పు చప్పుళ్లు, మేళతాళాల మధ్య సారలమ్మను వనం నుంచి గద్దెకు తీసుకువచ్చారు. భక్తుల నామస్మరణతో వీణవంక పరిసర



ప్రాంతాలన్నీ మారుమోగిపోయాయి.



**- పోటెత్తిన భక్తజనం...**

వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో జాతర ప్రాంగణం జనసంద్రంగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమ్మక్క-సారలమ్మ ఆలయ చైర్మన్ పాడి కృష్ణారెడ్డి, పాడి ఉదయ్ నందన్ రెడ్డి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**- పోలీసుల భారీ బందోబస్తు....**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ సిపి గౌస్ ఆలం నేతృత్వంలో కట్టుదిట్టమైన భద్రతను నిర్వహిస్తున్నారు. హుజురాబాద్ ఏసిపి మాధవి పర్యవేక్షణలో పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మినారాయణ, వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతిలు జాతరలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును నిర్వహిస్తున్నారు.



# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ నిర్వహించాలి

**- నామినేషన్ కేంద్రాల తనిఖీ - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య, హుజురాబాద్ / జమ్మికుంట**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు.ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంట వెంటనే



రోజు వారీగా టి పోల్ యాప్‌లో అప్ లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొర పాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పని తీరును పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేది వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, జమ్మికుంట కమిషనర్ ఎండి. ఆయాజ్, ఎన్నికల అధికారులు మాధవ రావు, మేనేజర్ భూపాల్ రెడ్డి, అశ్విని గాంధీ తదితరులు ఉన్నారు.



# జాతీయ ఉపాధి హామీ పథకం తొలగించాలని బిజెపి కుట్ర

**- ఎన్ఆర్ఈజిఎస్‌ను కాపాడుకుందాం - కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్**

**సూర్య - మానకొండూర్**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందామని కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంజిఎన్ఆర్ఈజిఎ బచావో సంగ్రామం సమావేశం నిర్వహించారు.సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్,పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు కుట్ర చేస్తున్నదన్నారు.పేదల పొట్ట కొట్టేందుకు ప్రధాని మోడీ కుట్ర పన్ని,గాంధీ పేరును తొలగించారని అన్నారు. పథకాన్ని కాపాడుకుందామన్నారు. సమావేశానికి అనుకున్న స్థాయిలో జనం హాజరు కాకపోవడంతో నేతలు కొంత అసహనం వ్యక్తం చేశారు.సుమారు 400 మంది కూడా సమావేశానికి రాకపోవడంతో అతిథులు అసంతృప్తికి గురయ్యారు.4 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం జన సమీకరణ కాకపోవడంతో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభం అయింది. సమ్మక్క,సారక్క జాతర కొనసాగుతుందని, కరీంనగర్లో బ్రహ్మోత్సవాలు నడుస్తుండటంతో ఆశించిన జనం సభకు రాలేదని క్షమించాలని ఎమ్మెల్యే పిసిసి అధ్యక్షున్ని కోరుతూ సమావేశం ముగించారు.అంతకు ముందు డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,మాజీ ఎంపి హన్మంత రావు,రాష్ట్ర నేతలు ఈరవత్రి అనిల్, నమిండ్ల శ్రీనివాస్,ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,కోడూరి సత్యనారాయణ గౌడ్,కర్ర సత్యప్రసన్న రెడ్డి, ముంజంపల్లి సర్పంచ్ నందగిరి కనకలక్ష్మి రవీంద్రా చారి,మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు,వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, మహిళలు పాల్గొన్నారు.




## అతికం రాజశేఖర్ గౌడ్‌ని ఘనంగా సత్కరించిన “అల్ఫోర్స్” నరేందర్ రెడ్డి

**సూర్య కొత్తపల్లి**



లితెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన అతికం రాజశేఖర్ గౌడ్ న్యాయవాదిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు “అల్ఫోర్స్” డా.వి.నరేందర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమానికై చేపట్టే పలు కార్యక్రమాలకు చేయూతనిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట న్యాయవాది ఆడెపు దినేష్ కుమార్ పాల్గొన్నారు.

## చొప్పదండి మున్సిపాలిటీలో మొదటి రోజు 10 నామినేషన్లు

**సూర్య చొప్పదండి**



చొప్పదండి పురపాలక సంఘం ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా మొదటి రోజు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఇందులో భాగంగా రెండో వార్డులో ఒకటి, మూడో వార్డులో ఒకటి, ఆరవ వార్డులు రెండు,ఎనిమిదో వార్డులో ఒకటి, పదో వార్డులో రెండు, 11వ వార్డులో ఒకటి,12 వార్డులో రెండు,మొత్తం 10 నామినేషన్లు స్వీకరించారు. ఇట్టి నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల ప్రత్యేక అధికారి డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఎన్నికల అబ్జర్వర్ జితేందర్ రెడ్డి పరిశీలించారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మేనేజర్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా సమ్మక్క-సారక్క జాతర మహోత్సవం

**సూర్య కరీంనగర్**




కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సమ్మక్క-సారక్క జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మక్క-సారక్క చిత్ర పటాలకు పూజలు నిర్వ హించారు. జాతర తెలంగాణకు గర్వకారణమని, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు.వేడుకల సందర్భంగా విద్యార్థులు సంప్ర దాయ దుస్తుల్లో పాల్గొని ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌లో 15 నామినేషన్లు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపాలిటీకి జరిగే రెండవ సాధారణ ఎన్నికల్లో మొదటి రోజు 15 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేసినట్లు కమిషనర్ ముసబ్ అహ్మద్ తెలిపారు. బుధవారం 6,7,13,14,18,22,24, 26,29,30 వార్డులో ఒక్కొక్క నామినేషన్, 9,15 వార్డుల్లో రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఆయన తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తి స్థాయి పోటీ

**సూర్య కరీంనగర్**



రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తి స్థాయిలో పోటీ చేయనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీఆర్పీ ఇంచార్జి మాదం రజినీ కుమార్ వెల్లడించారు. కరీంనగర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన పార్టీ మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో జవాబుదారీ, అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యమన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల అబ్జర్వర్ అఖిల్ పాషాతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అశీర్వదించండి... అభివృద్ధి చేస్తా

- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అశావాహుల హామీలు.. - గల్లిలో పెరిగిన అభ్యర్థుల ప్రచార సందడి..

- బల్దియాల్లో మొదలైన నామినేషన్ల పర్వం.. - తొలిరోజు స్వల్పంగానే నామినేషన్ల దాఖలు..

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



అన్న.. అక్క.. చెల్లి.. మన వార్డులో ఈసారి కౌన్సిలర్‌గా పోటీచేస్తున్నా.. మీరు ఆశీర్వదించి ఓటు వేయాలి. మీ సమస్యలన్నింటిని పరిష్కరిస్తా. మీ ఇంట్లో ఒక్కడిలా ఉంటూ మీరు గడపదాటకుండానే మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత తీసుకుంటా... మీరు ఆదరించాలంటూ జిల్లాలోని రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలలోని 124 వార్డుల్లో అభ్యర్థులు హామీలు గుప్పిస్తూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. నామినేషన్ల పక్రియ పూర్తికాకముందే గల్లిల్లో ప్రచారం జోరందుకోగా, ఎన్నికల నాటికి తారస్థాయికి చేరే అవకాశం ఉంది.

**- మొదలైన నామినేషన్ల పర్వం**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బుధవారం నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో పట్టణాల్లో సందడి నెలకొంది. ఆశావహులు తమ అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో మున్సిపల్? కార్యాలయాలు ఆశావాహులు అనుచరులతో సందడిగా మారాయి. పెద్దపెల్లి జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు కాగా రామగుండం కార్పొరేషన్? గా ఉంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు సుల్తానాబాద్ వార్డులు (15) ఉండగా 24 నామినేషన్లు దాఖలు అయ్యాయి ఇందులో కాంగ్రెస్ 11, బిఆర్ఎస్ 6, బిజెపి 4, ఇతర పార్టీలు 2, స్వతంత్ర అభ్యర్థుల నుండి 1 నామినేషన్ దాఖలు కాగా, పెద్దపల్లి మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా తొలి రోజు 52 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మంథని మున్సిపాలిటీలో 13 వార్డులు ఉండగా కాంగ్రెస్ 5, బిఆర్?ఎస్ 5, బిజెపి 2, ఇతర పార్టీలు 1 మొత్తంగా 13 నామినేషన్లు దాఖలు అయ్యాయి. రామగుండం కార్పొరేషన్ లో 60 డివిజన్లలో కాంగ్రెస్ 7, బిఆర్ఎస్ 3, బిజెపి 1, సిపిఐ (ఎం) 1, స్వతంత్రులు 1 మొత్తంగా 13 నామినేషన్లు దాకాలు అయ్యాయి.

**- జోరుగా ఇంటింటా ప్రచారం.**

మున్సిపల్ ఎన్నికల సమరం ముదురుతున్న వేళ, గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పక్కా వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. ఓటర్ల మనసు గెలుచుకోవడానికి కేవలం ప్రచారమే కాకుండా, తెరవెనుక రాజకీయ చదరంగాన్ని నడుపుతున్నారు. అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి తెల్లవారుజాము నుండే ప్రచారం మొదలుపెడుతున్నారు. మున్సిపాలిటీల్లోని ప్రతి గల్లీలోనూ అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలను ఇస్తూ ప్రచారం జోరును పెంచుతున్నారు. ముఖ్యంగా గెలుపోటములను ప్రభావితం చేసే 'వలస ఓటర్ల పై' అభ్యర్థులు ప్రత్యేకంగా గురిపెట్టారు. విద్య, ఉద్యోగ రీత్యా ఇతర నగరాలు, రాష్ట్రాల్లో ఉంటున్న ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి అభ్యర్థులు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రతి ఓటూ కీలకమే కావడంతో, దూరంగా ఉన్న ఓటర్లను ఫోన్లో ఆప్యాయంగా పలకరిస్తూ తనకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఓటింగ్ రోజు పోలింగ్ బూత్ వరకు తీసుకురావడానికి, ఎటువంటి ఇబ్బంది లేకుండా వచ్చి ఓటు వేసేలా ఉచిత రవాణా, భోజన సదుపాయం లాంటి వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.ప్రతి వార్డుకు ప్రత్యేకంగా వాట్సాప్? గ్రూపులను క్రియేట్? చేసి, స్థానిక సమస్యలపై తాము చేసే పోరాటాలను, భవిష్యత్? ప్రణాళికలను వీడియోల రూపంలో షేర్? చేస్తున్నారు.

**- ఎన్నికలొచ్చే... ప్రేమ పుట్టే...**

ఎన్నికలు వస్తున్నాయంటే చాలు రాజకీయ నాయకుల్లో ఎక్కడలేని ప్రేమ పుట్టుకొస్తుంది. మొన్నటివరకు అపరిచితుడిలా పలకరించే నాయకుడు ఇప్పుడు ఇంటి మనిషిలా మారిపోతున్నాడు. అన్నా, అక్క, తమ్ముడు, చెల్లె అంటూ ఆప్యాయ పలకరింపులు, అంతులేని అనురాగం ఒక్కసారిగా ఉప్పొంగిపోతున్నాయి. మీ ఇంటి మనిషిని ఆదరించి ఆశీర్వదించండి అంటూ ఓటును అభ్యర్థిస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే ఇది ఓటర్లపై ప్రేమా లేక ఓట్లపై వ్యామోహమా? ప్రజల సంక్షేమం కోసమేనా లేక కేవలం గద్దెనెకలన్న తపనా? అనే చర్చ సామాన్యుల్లో మొదలైంది.

## శ్రీ వేంకటేశ్వర స్వామి 47వ

# బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభపత్రిక ఆవిష్కరణ

**సూర్య తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో శ్రీ ఆండాళ్ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 47వ బ్రహ్మోత్సవాల ఆహ్వాన శుభపత్రికను ఆలయ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి గౌరవ సభ్యుల సుమతి (సిఈ), శ్రీనివాస్ గుప్తా (సిఈ),సదయ్య (ఈఈ), ఆలయ కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి పోలు కిషన్, జిల్లా అధ్యక్షులు ధరం శ్రీనివాస్ రెడ్డి, రాగి శ్రీనివాస్, జి. రమేష్, చీఫ్‌లు, సూపరింటెండెంట్లు, సభ్యులు కిరణ్, నాగరాజు, పుప్పాల అశోక్ రెడ్డి, ధనలక్ష్మి, కరుణ, నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్ష, కార్యదర్శులు, ఉద్యోగులు, కార్యవర్గ సభ్యులు, శ్రీ పద్మావతి మహిళా మండలి కమిటీ సభ్యులు, శ్రీవారి భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

**- పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాల వివరాలు**

ఫాల్గుణ శుద్ధ తదియ నుంచి నవమి వరకు అనగా 20-02-2026 నుంచి 25-02-2026 వరకు శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సేవాకాలములు, హోమాలు, పారాయణములు, ధ్వజారోహణం, ఎదుర్కోలు ఉత్సవం, కళ్యాణ మహోత్సవం, రథోత్సవం, దోలోత్సవం, పుష్పయాగం వంటి విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. 22-02-2026 ఆదివారం రోజున అశ్విని నక్షత్రం సందర్భంగా శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించబడనుంది.



ఉత్సవ కాలంలో సామూహిక లక్ష్మీపూజలు, విష్ణు సహస్రనామార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఒగ్గుకథ కాలక్షేపం, అన్నమాచార్య కీర్తనలు భక్తులను అలరించనున్నాయి.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.





## నగర అభివృద్ధికి బీఆర్ఎస్ గెలుపే మార్గం


**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**సూర్య కరీంనగర్**

కరీంనగర్ నగరంలోని 5వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే నగరపాలక ఎన్నికల్లో 5వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి గాదే రూప శ్రీనివాస్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గత పదేళ్లలో బీఆర్?ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ అభివృద్ధి సాధ్యమైందని, భవిష్యత్తులోనూ నగర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

## టిఫిన్ సెంటర్ చట్నీలో బొద్దింక

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని లడ్డు కాజా చౌరస్తా సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో బుధవారం ఓ కస్టమర్ మూడు ప్లేట్ల టిఫిన్ పార్సల్ తీసుకొని ఇంటికి వెళ్లగా, పార్సల్‌ను ఓపెన్ చేయగానే చట్నీలో బొద్దింక ప్రత్యక్షమైంది. ఈ ఘటనతో తీవ్ర షాక్‌కు గురైన కస్టమర్ వెంటనే టిఫిన్ సెంటర్ యజమానిని నిలదీశారు.జగిత్యాల లోనే గత 20 రోజుల క్రితం మరో టిఫిన్ సెంటర్?లో బల్లి ప్రత్యక్షమైన ఘటన ఇంకా ప్రజలు మరిచిపోకముందే, ఇప్పుడు మరోసారి ఇలాంటి ఘటన జరగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వరుస ఘటనల నేపథ్యంలో జగిత్యాల ప్రజలు బయట టిఫిన్ చేయాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొంది.సంబంధిత అధికారులు హోటల్లలో తనిఖీలు చేపట్టాలని, శుచి శుభ్రత లేని హోటల్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరు సహకరించాలి

**- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

ఎన్నికల కోడ్? నియమావళిని అందరు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్?లో మిని సమావేశ హాల్ లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్? బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ( లోకల్ బాడీ) బి. రాజ గౌడ్ పాల్గొని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు, వాల్‌పోస్టర్, ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాలు పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరం నిబంధన పాటించాలని కోరారు. ఎన్నికలు జరుగు 5 మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతి నిధులు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలకు లోబడి ఎన్నికల ఖర్చును వినియోగించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలపై తప్పనిసరిగా ప్రింటర్ల సమాచారం ఉండాలని రాజకీయ పార్టీలకు సూచించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణం లో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సంహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఎన్నికల విభాగం తదితరులు పాల్గొన్నారు.



# హుజురాబాద్‌లో వైభవంగా మొదలైన జాతర

## - గద్దెపై కొలువుదీరిన సారలమ్మ

**సూర్య, హుజురాబాద్**

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క – సారలమ్మ జాతర హుజురాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట సమీపంలో అత్యంత వైభవంగా భక్తుల కోలాహలం మధ్య ప్రారంభమైంది. జాతరలో అత్యంత కీలకమైన మొదటి ఘట్టం బుధవారం నాడు భక్తిశ్రద్ధల మధ్య ముగిసింది.

**- ఘనంగా సారలమ్మ రాక**

పట్టణంలోని తెనుగువాడ నుంచి సారలమ్మను పూజారులు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా రంగనాయకుల గుట్ట వద్దకు తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు జోరుగా సాగాయి. గద్దెపైకి సారలమ్మను కోయ పూజారులు ప్రత్యేక పూజలు



చేసిన అనంతరం జాతర ఉత్సవాలు అట్టహాసంగా మొదలయ్యాయి. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు నీరాజనాలు పలికారు. చివరగా రంగనాయకుల గుట్ట వద్ద ఉన్న గద్దెలపై సారలమ్మను ప్రతిష్ఠించడంతో భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. భక్తుల కోలాహలం తొలిరోజే భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కుంకుమ, పసుపు, బెల్లం (బంగారం) సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. వచ్చే మూడు రోజుల పాటు ఈ ప్రాంతం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోనుంది. సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్ ఏసిపి వానంశెట్టి మాధవి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. హుజురాబాద్ టౌన్ సిఐ కరుణాకర్, ఇతర పోలీసులు భక్తులకు ఇలాంటి ఇబ్బంది రాకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. జాతరకు వెళ్లే దారిలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఏర్పాట్లు చేశారు. జాతర ఏర్పాట్లను జాతర కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం వైద్య ఆరోగ్యశాఖ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది.

# అంబరాన్నంటిన "స్థవన్"విద్యార్థుల వీడ్కోలు సంబరాలు

**సూర్య, కరీంనగర్**

స్థానిక కరీంనగర్‌లోని అల్గునూర్ పారమిత వరల్డ్ స్కూల్ సి.బి.ఎస్ .సి పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమము స్థవన్ అనే పేరుతో నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీకర్ జ్యోతి ప్రజ్వలన చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు.పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ప్రసాద్ రావు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో అనేక సవాళ్ళను ఎదుర్కొంటూ సమాజంలో ప్రత్యేక స్థానం ఎలా ఏర్పరుచుకోవాలో తెలిపారు.సుమారు పదకొండు సంవత్సరాలుగా పారమిత విద్యాసంస్థల్లో విద్యనభ్య




సించిన విద్యార్థులు నైతిక విలువలను ,స్వీయ క్రమశిక్షణ, నియంత్రణ ఏర్పరుచుకున్నారు అని అన్నారు.విద్యార్థులు వారి పాఠశాల విద్య ను పారమిత విద్యాసంస్థల్లో అభ్యసించి ఉన్నత విద్యాభ్యాస నిమిత్తము పాఠశాలను వదిలి వెళ్ళుందుకు వారి జ్ఞాపకాల మధురానుభవాలను నెమరు వేసుకుంటూ ఒకింత బాధ పడ్డారు, అత్యుత్తమ ప్రతిభ గల ఉపాధ్యాయ బృందం బోధనతో విషయ పరిజ్ఞానం, నైతిక విలువలు అలవర్చుకొని వారిని ఆదర్శంగా తీసుకుంటూ జీవితంలో మరో అడుగు ముందుకు వేసి, రాబోయే బోర్డు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యాసంస్థకు, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. వీడ్కోలు కార్యక్రమము ఆద్యంతము ఆనందభరితంగా ఉల్లాసంగా కొనసాగింది. ఈ కార్యక్రమములో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, వినోద్ రావు,రాకేష్, అనూకర్ రావు,వి.యు.యం. ప్రసాద్,ప్రిన్సిపల్ ఏ. శ్రీకర్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు బిఆర్ఎస్ పార్టీలో చేరిక

**సూర్య, కరీంనగర్**



మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో 48వ డివిజన్ కు చెందిన సంద స్వప్న-అశోక్ వారి అనుచరులు 50 మందితో కలిసి మాజీ మంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వీరికి ఎమ్మెల్యే గంగుల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ...బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ నాయకత్వంలో నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందని..ఈ రెండేళ్ల కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల పాలనలో కరీంనగర్ ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదని. కరీంనగర్ అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ పార్టీ ద్వారానే అభివృద్ధి చెందుతుందని, మాజీమంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ నాయకత్వంలో పనిచేయాలని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే నివాసంలో జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, కొత్తపెల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్,మాజీ కార్పొరేటర్లు తుల బాలయ్య, బోనాల శ్రీకాంత్, కమ్మ రవి, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, నాయకులు మిడిదొడ్డి నవీన్, డివిజన్ వాసులు అభిషేక్, శ్రావణ్, స్వప్నలతోపాటు డివిజన్ వాసులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**సూర్య, వీర్నపల్లి**

వీర్నపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైందని ప్రధానోపాధ్యాయులు అశోక్ పేర్కొన్నారు. బుధవారం సర్పంచ్ జోష్ణ అరుణ్ కుమార్, ఎంసీ చైర్మన్ రాముల నాయక్,ఎంపీడీవో శ్రీలేఖ, తహశీల్దార్ ముక్తార్ పాషా, గర్జనపల్లి సర్పంచ్ రాకేశ్ గౌడ్తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.ఫిబ్రవరి 28 వరకు పరీక్షల దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జమ్మికుంటలలో ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసిన సిపి గౌష్ఆలం

**సూర్య, జమ్మికుంట**

జమ్మికుంట మున్సిపాలిటీకి త్వరలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు



చేసిన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు కౌంటింగ్ కేంద్రాలను ఆయన వ్యక్తిగతంగా పరిశీలించారు.జమ్మికుంట పురపాలక సంఘ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.స్ట్రాంగ్ రూమ్‌లు & కౌంటింగ్ కేంద్రాలు జమ్మికుంట డిగ్రీ పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయ బోయే కౌంటింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను సిపి గారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని, బందోబస్తు విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సూచించారు.ఈ పర్యటనలో సిపితో పాటు ఏసీపీ మాధవి, జమ్మి కుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ, హుజూరాబాద్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవికాలం నీటి ఎద్దడి లేకుండా చర్యలు

**సూర్య, ఇల్లంతకుంట.**

మండలంలోని అన్నీ గ్రామాల్లో రాబోవు వేసవి కాలంను దృష్టిలోపెట్టుకుని, ముందస్తు చర్యలు చేపట్టేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయం లో సమావేశం జరిగింది.ఫిబ్రవరి 1వ తేదీ నుండీ 20 వరకు సంబంధిత ఏఇ,లు, ఎంపిఓ, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు కలిసి గ్రామాలను సందర్శించి, నీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు చేపట్టనున్నట్లు ఎంపిడిఓ శశికళ తెలిపారు.ఈ సమావేశంలో సర్పంచులు, ఆర్ డబ్ల్యూ డి ఇ ఇ పావని, ఎఇ లు రమేష్, చందు, ప్రత్యేక అధికారి రామకృష్ణ, ఎంపిఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో నేపథ్యంలో... బండి సంజయ్ సాంగ్ విడుదల

- దుమ్మురేపుతున్న 'బలిరా బలిబలిరే' సాంగ్
- కరీంనగర్‌లో అట్టహాసంగా విడుదల చేసిన బిజేపీ శ్రేణులు

**సూర్య, కరీంనగర్**




మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ రచయిత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై రాసిన పాట హల్ చల్ చేస్తోంది. ప్రముఖ రచయిత బుల్లెట్ బండి లక్ష్మణ్ రాసిన పాట ప్రముఖ సింగర్ నల్ల గొండ గద్దర్ నోట వెలువడింది. ఈరోజు సాయంత్రం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఒకే సారి ఏడు చోట్ల బీజేపీ శ్రేణులు ఈ పాటలను ఆవిష్కరించారు. భారీ ఎత్తున బీజేపీ కార్యకర్తలు, బండి సంజయ్ అభిమానులు గీతా భవన్ చౌరస్తా, ఎస్ఆర్ఆర్ కాలేజ్,రామ్ నగర్ స్టేజ్, కమాన్ చౌరస్తా,టవర్ సర్కిల్,గాంధీ రోడ్డు, కోర్టు చౌరస్తాల వద్ద ఈ పాటను విడుదల చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ పాటకు భారీ ఎత్తున స్పందన లభిస్తోంది. యువతను, కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదులను ఉర్రూతలూగిస్తుండటం గమనార్హం.

## శాతవాహన సెంట్రల్ లైబ్రరీ సాఫ్ట్వేర్‌తో ఆధునీకరణ

**సూర్య, కరీంనగర్**

శాతవాహన విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రరీలో ఈరోజు ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ కొత్త సాఫ్ట్వేర్ను ప్రారంభించారు. లైబ్రరీ ఆధునీకీకరణ



లో భాగంగా ఈ సాఫ్ట్వేర్ను కోహను తీసుకున్నామని ఇది లైబ్రరీ మేనేజ్మెంట్ సిస్టంలో భాగమని ఈ సాఫ్ట్వేర్ అంతర్జాల ఆధారంగా పనిచేస్తుందని విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లోని లాగిన్ ద్వారా ప్రతి విద్యార్థి లైబ్రరీలో ఉన్న పుస్తకాల సంఖ్యను చూసి వాటిని అరువు తీసుకోవడానికి తిరిగి ఇవ్వడానికి ఉపయోగించవచ్చని, పుస్తకాలను, జర్నల్స్‌ని అంతర్జాలం ఆధారంగా (ఆన్లైన్ పబ్లిక్ ఆక్సెస్ క్యాటలాగ్) చూసుకొని విద్యార్థులు చదువుకోవచ్చని, ఇది చాలా సౌకర్యంగా ఉండటమే కాకుండా ప్రపంచంలోని నాలెడ్జ్ అంతా లైబ్రరీ గుప్పిట్లో పొందడానికి వీలవుతుందన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని, జ్ఞాన సమపార్జనలో చాలా ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి టు విసి డాక్టర్ హరికాంత్, సెంట్రల్ లైబ్రరీ ఇంచార్జి డా. నమ్రత, లైబ్రరీ అసిస్టెంట్ గీత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. పద్మావతి, జాస్పాల్ లైబ్రరీ రికార్డు అసిస్టెంట్, విశ్వవిద్యాలయ సిస్టం అడ్మినిస్ట్రేటర్ జ్ఞానేశ్వర్, లైబ్రరీ ఉద్యోగులు, శ్రీ గాయత్రి టెక్నాలజీస్ అసోసియేట్స్ జి వి గుప్తా పాల్గొన్నారు.

## గద్దెపై కొలువైన సారలమ్మ

**సూర్య - పెద్దపల్లి రూరల్**

మండలంలోని తుర్కల మద్దికుంట, హనుమంతునిపేట గ్రామాల్లో బుధవారం గద్దెపై సారలమ్మ కొలువుదీరింది. కోయ పూజారులు వనం నుండి సారలమ్మను తీసుకొని భక్తుల దర్శనం కోసం గద్దెపై అవతరించారు. వారి వెంట జాతర కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## 'ఖని' లో ప్రారంభమైన సమ్మక్క-సారలమ్మ జాతర

**- సాయంత్రం గద్దెను అధిష్ఠించిన సారలమ్మ**

**సూర్య-గోదావరిఖని**

పట్టణ శివారులోని పవిత్ర గోదావరి నది సమీపంలో రెండేళ్ల కొకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఈ ఏడాది అట్టహాసంగా, మరింత భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా రామగుండం శాసనసభ్యులు



రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం జాతర ప్రారంభం రోజున ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఆదివాసీ గిరిజన సాంప్రదాయాల ప్రకారం, ప్రత్యేక పూజల అనంతరం కోయ



పూజారులు గద్దెలపైకి సారలమ్మను తీసుకు వచ్చారు. కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య, భక్తుల జయజయ ధ్వానాలతో అమ్మవారు గద్దెను అధిష్ఠించారు.

# చొప్పదండి మున్సిపల్ పై గులాబీ జెండా ఎగురవేస్తాం

## - చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్

### - బిఆర్ఎస్వి విభాగం రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు తుంగ బాలు

**సూర్య చొప్పదండి**

అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గం లోని ఏకైక మునిసిపాలిటీ చొప్పదండి మునిసిపాలిటీ పై గులాబీ జెండాను ఎగురవేస్తాం అని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు బత్తిని సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా బి ఆర్ ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తో కలిసి కార్యకర్తలను ఉద్దేశించి గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు మాట్లాడుతూ ఈ మున్సిపల్ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవని ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని అప్పుడే అన్ని స్థానాల్లో అభ్యర్థులు గెలిచేందుకు అవకాశం



ఉంటుందన్నారు. పార్టీ కార్యకర్తలే అభ్యర్థుల గెలుపు బాటను నిర్ణయిస్తారని, కార్యకర్తల కృషి వాళ్లే పార్టీ అభ్యర్థులు గెలుపొందేందుకు అవకా శం ఉంటుందని, అందుకోసం ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు సైనికుని వలె పనిచేసే 14 వార్డుల కౌన్సిలర్ గెలిపించి, చొప్పదండి మున్సిపల్ పై గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని, కార్యకర్తలు అధైర్యపడవద్దని తప్పకుండా ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి సర్పంచ్ బందారపు అజయ్ కుమార్ ,మాజీ జెడ్పిటిసిలు మాచర్ల సౌజన్యబివినయ్ కుమార్, ఈపనపల్లి సాంబయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ లు ఆరెళ్ళ చంద్రశేఖర్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్లు కొత్తూరు మహేష్, మాధురి శ్రీనివాస్, నాలుమాచు రామకృష్ణ, రాగంపేట సర్పంచ్ మామిడి రాజేశం, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి అజ్జు, ఎండి జహీర్, నాయకులు మా ఊరవు మహేష్, పోరండ్ల నితీష్, పెద్దెల్లి అనిల్, నరేష్ రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## 18 రోజులకు స్వగ్రామానికి చేరుకున్న మేకల ప్రవీణ్ మృతదేహం ..

### - మృతదేహం వద్ద బోరున విలపించిన కుటుంబ సభ్యులు..

**సూర్య బోయినపల్లి.**



బోయినపల్లి కి చెందిన మేకల ప్రవీణ్ ఉన్న ఊరిలో ఉపాధి లేక అప్పులు ఎక్కువ అయి బతుకు దెరువు కోసం కాన రాని దేశం పోయి యూరప్ కంట్రీ అయిన అర్మేనియా దేశం వెళ్ళి ఈ నెల 10 రోడ్డు ప్రమాదం లో మృతి చెందగా బుధవారం ఉదయం మృతదేహం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు ప్రవీణ్ మృతదేహం పై పడి బోరున విలపిం చారు. ఇంటికి పెద్ద దిక్కు ఒక్కడు మృతి చెందడంతో తల్లి తండ్రులు భార్య పిల్లలు బోరున విలపిస్తుండగా గ్రామస్తుల కన్నీరు పెట్టుకున్నారు.శ్రీనగర్ కాలని వాసులు చందాలు వేసి దహన సంస్కారాలు నిర్వహించగా గ్రామస్తులు తోచినంత ఆర్థిక సాయం చేశారు.మృతునికి అమ్మ నాన్న తో పాటు భార్య కవిత, కూతురు శ్రావణి 14,కొడుకు లు సంజయ్ 10 ,అభినయ్ 5 లు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు కృషిచేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎంపీ ఓం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు కోరారు.

## బీఆర్ఎస్ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్గా బైరి విజయ్,కో-కన్వీనర్ ల నియామకం

### - బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

**సూర్య కోరుట్ల టౌన్**

బీఆర్ఎస్ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్?గా బైరి విజయ్,కో-కన్వీనర్ లను నియమించినట్లు బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు. కోరుట్ల పట్టణ, మండల బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్,కో-కన్వీనర్ లకు నియామక పత్రాలు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రకటించారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్?గా బైరి విజయ్ కుమార్, కో- కన్వీనర్లుగా సుతారి నవీన్ కుమార్,వనపర్తి క్రాంతికుమార్,వేముల నాగరాజు,కటుకం రాజేష్,ఊరడి నరేందర్,రాస గౌతమ్,అల్వాల వినయ్ కుమార్,సదుల మాధురి,ఓటారికారి రంజిత,గట్ల సృజన్ కుమార్ లను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ నియామకాల పట్ల భారత రాష్ట్ర సమితి పార్టీ కోరుట్ల మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, కోరుట్ల పట్టణ భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యదర్శి గుడ్ల మనోహర్ తదితర నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ లీగల్ సెల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన భారత రాష్ట్ర సమితి పార్టీ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్,కో-కన్వీనర్లు పార్టీ న్యాయపరమైన కార్యకలాపాలను సమర్థవంతంగా బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



## అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్

**సూర్య జగిత్యాల అర్బన్**



అఖిల భారత ప్రభుత్వ ఉద్యో గుల సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఎన్నికైన టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారమ్ జగదీశ్వర్ ను జగిత్యాల జిల్లా ఉద్యోగుల సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు.మారం జగదీశ్వర్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అఖిల భారత ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీఎన్జీఓ భవన్ లో జగిత్యాల జిల్లా టీ ఎన్ జీ ఓ అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి, జగిత్యాల జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ, కార్యదర్శి యు.నారాయణ, కోశాధికారి సిహెచ్ సతీష్ కుమార్, రాజేశం, రాజశేఖర్ రెడ్డి, మణి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మాంచి, భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

## రేపు గాలిపల్లి లో సీఎం కప్ క్రీడల పోటీల నిర్వహణ.

### - ఎంపిడిఓ శశికళ.

**సూర్య ఇల్లంతకుంట**

రేపు(శుక్రవారం)మండలం లోని గాలిపల్లి లో సిఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడలను ప్రభుత్వం నిర్వాహిస్తున్నట్లు ఎంపిడిఓ శశికళ బుధవారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కబడ్డీ,ఖో ఖో, చెస్ క్రీడలు, శనివారం ఉదయం 10 గంటలకు వాలీబాల్,యోగా,అథ్లెటిక్స్ క్రీడలనునిర్వహించబడుతాయని తెలిపింది.క్రీడాకారులు ఆన్లైన్ లో పేరు నమోదు చేసుకున్న వారు హాజరు కావాలని కోరారు.క్రీడలను నిర్వహణకు మైదానంలో ఏర్పాటు చేసేందుకు సూచనలు చేసినట్లు తెలిపారు.

## జాతర సిబ్బందికి లయన్స్ క్లబ్ ద్వారా భోజన సేవలు

**సూర్య కరీంనగర్**

సమ్మక్క--సారక్క జాతర సందర్భంగా కరీంనగర్ 1 డిపోలో లయన్స్ కరీంనగర్ జిల్లా 320జి ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా మేడారం విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్లు, బస్సు డ్రైవర్లకు అల్పాహారం, భోజనాలను అందజేశారు. హైదరాబాద్తో పాటు వివిధ డిపోల నుంచి వచ్చిన సుమారు 200 మంది సిబ్బందికి ఈ సేవలు అందించారు. సాయంత్రం రోహన్ ఫెర్టిలిటీ (IVF) కరీంనగర్ వారి సహకారంతో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సేవలు నాలుగు రోజుల పాటు కొనసాగ నున్నాయి. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఐ. విజయ మాధురి, రోహన్ ఫెర్టిలిటీ మేనేజర్ చె. రమేష్, మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్ లయన్ రావికంటి కృష్ణ కిషోర్తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## 8వ డివిజన్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా అజాహరుద్దీన్ నియామకం

**సూర్య తిమ్మాపూర్**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్(అల్గునూర్) కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మహ్మద్ అజాహరుద్దీన్ నియామక మయ్యారు. ఈ మేరకు బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో గోపు మల్లారెడ్డి గెలుపు కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి,మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు రహమత్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ చల్లా రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,మామిడి నరేందర్ రెడ్డి, చిందం కిష్టయ్య, దాసం నాగేందర్ జాప రాఘవరెడ్డి, జాప రవీందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, కొమురయ్య, చిల్ల రాములు, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీకి మొదటి రోజున 11 నామినేషన్లు.

**సూర్య జమ్మికుంట**




వచ్చే నెల 11న జరగనున్న జమ్మికుంట మున్సిపాలిటీ పాలకవర్గం ఎన్నికలలో బుధవారం మొదటి రోజున మొత్తం 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి 30 వార్డులకు జరగనున్న ఈ ఎన్నికలలో మొత్తం 34455 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించనున్నారు ఇందులో పురుషులు16815మంది మహిళలు17639మంది ఉన్నారు బుధవారం మొదటి రోజున పలు వార్డులలో 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి ఇందులో బీజేపీ నుండి 3 కాంగ్రెస్ నుండి 5 బిఆర్ఎస్ నుండి 2 ఇండిపెండెంట్ సభ్యులు 2 నామినేషన్లు దాఖలు చేశారు మున్సిపాలిటీ కార్యాలయంలో మూడు రోజులపాటు కొనసాగనున్న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమానికి పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు

## కొత్తపల్లి కార్పొరేషన్ పరిధిలో ఎక్స్ ప్రెస్ బస్సులను నిలపాలి

### - బీజేపీ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీపీ వాసాల రమేష్

**సూర్య కొత్తపల్లి**



కొత్తపల్లి పట్టణంలో ఎక్స్ ప్రెస్ బస్సులను ఆర్టీసీ ఆపాలని కొత్తపల్లి మాజీ ఎంపీపీ బిజెపి రాష్ట్ర నాయకులు వాసాల రమేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపెల్లి మాజీ ఎంపీపీ బీజేపీ రాష్ట్ర నాయకులు వాసాల రమేష్ మాట్లాడుతూ గతంలో కొత్తపెల్లి బస్టాండ్ ప్రాంతంలో బస్సులను ఆపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుపోయినప్పటికీ వారు ఆదేశించిన కూడా అధికారులు కొత్తపెల్లి లో బస్సులు ఆపడం లేదు అని అన్నారు. కొత్తపెల్లి పట్టణంలో బస్సులు ఆగకపోవడం వల్ల ప్రయాణికులు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్టీసీ రీజియన్ కు సంబంధించిన ఐదు జిల్లాల పరిధిలోని బస్సులను కొత్తపెల్లి పట్టణంలో ఆపాలని కోరారు. బస్సులు ఆపకపోవడంతో మహిళలు విద్యార్థులు యువకులు ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి బస్సులను నిలవాలని కోరారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ కౌన్సిలర్ స్వర్గం వజ్రా నరసయ్య, చిట్కూరి శ్రీనివాస్ ,కారం రవి ప్రసాద్ ,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అబ్దుల్ రహీంకు పరామర్శ

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ రాజనర్సింహారెడ్డి, టియుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు అబ్దుల్ రహీం తల్లి షేఖియాబేగం ఇటీవల చనిపోగా బుధవారం గంభీరావుపేటలోని తన స్వగృహంలో పరామర్శించారు. వీరి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగ రాజారాం రెడ్డి తదితరులు ఉన్నారు.



# మున్సిపాలిటీలలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించాలి

**- రెండేళ్లల్లో 1000 కోట్లతో అభివృద్ధి పనులు - పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగురాలి**

**- కాంగ్రెస్ పార్టీలో చేరిన బి ఆర్ ఎస్ నాయకుడు ఆయిల రమేష్ - మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు**





**సూర్య - సుల్తానాబాద్**

మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని మున్సిపల్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి , బిఆర్ఎస్ నాయకుడు ఐల రమేష్ తన భారీ అనుచర గణంతో కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రులు, ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణంలో ద్విచక్ర వాహన, మహిళలతో బాణాసంచా పేలుస్తూ భారీ ర్యాలీ స్థానిక యశోద నరహరి ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలంలో పెద్దపల్లి లో 63 కోట్లు సుల్తానాబాద్ 15 కోట్లా రూపాయలతో మున్సిపాలిటీలలో అభివృద్ధి పరిచమని తెలిపారు పెద్దపల్లి సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజక వర్గంలో అభివృద్ధి లక్ష్యంగా శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు పనిచేస్తున్నారని రెండు సంవత్సరాల కాలంలో పెద్దపల్లికి 4 పోలీస్ స్టేషన్ లు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే దేనిని ఈ ప్రాంత అభివృద్ధిపై ఎమ్మెల్యేకు ప్రత్యేక ప్రేమ ఉందని ముఖ్యమంత్రికి అత్యంత సన్నిధిగా ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సుల్తానాబాద్ చెరువు ప్రాంతానివి ఎనిమిది కోట్ల రూపాయలతో మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాంచేందుకు ఎమ్మెల్యే నిర్విరామ కృషి చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరిచేలా సహకరించాలన్నారు. టూరిజం మంత్రి కృష్ణారావు ఈ బిప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా మార్చేందుకు సహకరిస్తున్నారని చారిత్రాత్మక కట్టడాలైన రామగిరి కీల తో పాటు అనేక చారిత్రాత్మక ప్రాంతాలు ఉన్నాయని వాటిని అభివృద్ధి పరిచేందుకు మంత్రి ప్రత్యేక చొరవ చూపెడుతున్నారని అన్నారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని భ్రష్టు పట్టించారని ప్రస్తుతం ఉన్న శాసనసభ్యులు విజయ రమణారావు అనేక అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు పోతున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు గెలుపు గుర్రాలకు టికెట్లు కేటాయిస్తామని ఆశవాహులు నిరాశ చెందకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలోనే 1000 కోట్ల రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధి పరచడం సామాన్య విషయం కాదని అభివృద్ధికి మారుపేరు పెద్దపల్లి శాసనసభ్యులు విజయ రామారావు అని అన్నారు. ఆశావాహులు ఎవరు నిరాశ చెంద వద్దని పార్టీ వారికి సముచిత స్థానం కల్పిస్తుందని మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అనేక నామినేటెడ్ పదవులు లభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు మినుపాల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూప, సారయ్య గౌడ్, సాయిరి మహేందర్,ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ చీకట్ల ముండయ్య, శ్రీగిరి శ్రీనివాస్, వేగోళం అబ్బయ్య గౌడ్, బిరుదు సమత కృష్ణ, ఊట్ల వరప్రసాద్, ముత్యాల రవీందర్, కందుకూరి ప్రకాష్ రావు, పెగడ పరుశురాములు, గరిగే శ్రీనివాస్, తొర్రి కొండ ప్రభాకర్, గాదాసు రవీందర్, కరుణాకర్, చింతల సునీత రాజు, లతోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పలువురు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**-కరీంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**




ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం కరీంనగర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ అందించే ఉచిత శిక్షణను, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ బండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణా ప్రభుత్వం, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న తెలంగాణా స్టేట్ స్టడీ సర్కిల్ కరీంనగర్ బ్రాంచ్‌లో స్టేట్ మరియు సెంట్రల్ సర్వీసు ఉద్యోగాలతో పాటు బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ ఉద్యోగాలకు ఐదు నెలల ఫౌండేషన్ కోర్స్(2025-26) అందిస్తున్నామన్నారు. 100 మందికి ఉచిత బోజన వసతి సౌకర్యాలతో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. గతంలో 928 మందికి శిక్షణ అందించగా, అందులో 308 మందికి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు.కావున ఇట్టి ఉచిత శిక్షణను అర్హులైన నిరుద్యోగ పట్టభద్రులు దరఖాస్తు చేసుకోగలరు. 3 లక్షలలోపు వార్షిక ఆదాయం కలిగిన పెద్దపల్లి జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులు వారి దరఖాస్తులను ఆన్లైన్‌లో http://tsstudycircle.co.in/ (ఎస్సీ స్టడీ సర్కిల్) వెబ్ సైట్ ద్వార తేది 30.1.2026 లోగా చేరే విధంగా అప్లై చేసుకొవాలన్నారు. దీనికి ఎలాంటి పరీక్ష ఫీజు చెల్లించాల్సిన అవసరం లేని, అప్లై చేసుకునేటపుడు ఎస్.ఎస్.సి., డిగ్రీ ప్రోవిసొనాల్, మార్కుల మేమో, కులం, ఆదాయం సర్టిఫికెట్ లతో పాటు ఆధార్ కార్డులను తమవెంట ఉంచుకోవలన్నారు. వచ్చిన మొత్తం అప్లికేషన్ల నుండి ఫిబ్రవరి 8 వ తేదీ నాడు కరీంనగర్ లో జరిగే ప్రవేశ పరిక్ష ద్వారా 100 మందిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మొత్తం అభ్యర్థులలో రిజర్వేషన్ ఆధారంగా ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 15 శాతం సీట్లు కేటాయిస్తారు. మరియు మొత్తంలో మహిళలకు 33 శాతం, దివ్యాంగులకు 5శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. ఇతర వివరాలకు 98852 18053 నందు సంప్రదించవచ్చని తెలిపారు.

## ముత్తారంలో మొదలైన కోతుల వేట

**సూర్య ముత్తారం**



ముత్తారంలో మొదలైన కోతుల వేట. ముత్తారం గ్రామంలో కోతుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించిన గ్రామ సర్పంచ్ సుధాటి రవీందర్ రావు కోతుల బెడద నుంచి గ్రామానికి విముక్తి కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం రోజున ప్రత్యేకంగా ఇనుప బోనుల ద్వారా కోతులను పట్టే నిపుణులను పిలిపించి గ్రామంలో కోతుల పట్టివేత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధాటి రవీందర్ రావు మాట్లాడుతూ, ఇప్పటివరకు సుమారు 300 కోతులను పట్టినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి వార్డులోనూ కోతుల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. గ్రామస్తులు సర్పంచ్ చేపట్టిన ఈ చర్యపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, కోతుల బెడద నుంచి విముక్తి కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## బేగంపేటలో నర్సరీ ప్రారంభం

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం బేగంపేట గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కల నర్సరీని ఏర్పాటు చేశారు. ఈ నర్సరీని గ్రామ సర్పంచ్ మంతెన చంటి, ఉపసర్పంచ్ సందేల రేణుక కుమారస్వామి  ఘనంగా ప్రారంభించారు.గ్రామాన్ని పచ్చదనంతో అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ నర్సరీని ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మాదాసి శ్రీనివాస్, పిడుగు సతీష్, కొత్తూరి వాణి, మోహన్, గ్రామ కార్యదర్శి రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.



## సొంతగూటికి చేరిన గొల్లపల్లి మాజీ సర్పంచ్

**సూర్య, తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లెత్తుల అంజయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ నుండి నేడు తిరిగి సొంతగూటికి బీఆర్ఎస్ పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నియోజవర్గ, రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ హామీల పేరుతో కాలం గడుపుతూ ప్రజలను మోసం చేస్తుందని నేడు తిరిగి పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల రమేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సర్పంచ్ ఎలుక ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, కనకం కొమురయ్య, పాశం అశోక్ రెడ్డి, మాతంగి లక్ష్మన్, నీలం ఓదెలు,సల్ల మహేందర్, కాల్వ మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, సిల్ల పర్శరాములు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు సింగరేణిలో ఉచిత వోల్వో డంపర్ ఆపరేటర్ శిక్షణ

**సూర్య, యైటింక్లయిన్ కాలనీ**

సింగరేణి మానవ వనరుల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వోల్వో డాంపర్ ఆపరేటర్ వృత్తి విద్యా కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గానూ 4వ క్వార్టర్, 4వ బ్యాచ్ శిక్షణకు సంబంధించి కంపెనీ ఉత్తర్వులు జారీ చేసింది. 10వ తరగతి ఉత్తీర్ణులై హెచ్చివి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, లైసెన్స్ పొందిన తర్వాత కనీసం 3 ఏళ్ల అనుభవం తప్పనిసరితో ఈ శిక్షణ ఇవ్వనుంది. మొదటి విడత 02.02.2026 నుంచి 21.02.2026 వరకు రెండవ విడత ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో ఆర్జీ1 వద్ద 12 రోజుల పాటు థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని తెలిపారు. మొత్తం 60 మంది అభ్యర్థులను ఈ బ్యాచ్ కోసం ఎంపిక చేస్తారని, ప్రతి ఏరియా నుండి 05 మంది అభ్యర్థులను, మరో 05 మందిని వెయిటింగ్ లిస్ట్ కోసం ఎంపిక చేయాలని జిఎంలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం తమ పరిధిలోని ఏరియా జిఎం కార్యాలయంలో సంప్రదించాలని సింగరేణి యాజమాన్యం సూచించింది.

## నర్సరీలో 5200 మొక్కల పెంపకం

**- సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామములోని నర్సరీని బుధవారం స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు సందర్శించారు. 5200 ల వివిధ రకాల మొక్కలను పెంచుతున్నామని ఆమె తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ మొక్కలను పెంచుతున్నామని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వీటిని గ్రామంలో పలు ఏరియాలో నాటడం జరుగుతుందని తెలిపారు. మొక్కలను సరిగ్గా పరిరక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్, పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ సందేవేన జ్యోతి కుమార్, వన సేవకులు ఈరవేన శ్రీధర్ పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను సన్మానించిన ఆర్ ఎం పి డివిజన్ అధ్యక్షుడు కె వి చారి

**సూర్య ముత్తారం**

మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను సన్మానించిన ఆర్ ఎం పి డివిజన్ అధ్యక్షుడు కె వి చారి. మంథనిలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును మంథని ఆర్ఎంపీల సంఘం డివిజన్ అధ్యక్షుడుగా ముత్తారం మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కసివోజ్జుల వీరాచారి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దావోస్ విదేశీ పర్యటన ముగించుకొని మంథనికి వచ్చిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. వీరి వెంట కుక్కల చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



# రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి

## - అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



వచ్చే నెల 17 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బియ్యని శివకుమార్

**సూర్య ముత్తారం**



ముత్తారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మైదంబండ సర్పంచ్ బియ్యని శివ కుమార్ ను నియమించిన ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు. ఈ సందర్భంగా మైదంబండ సర్పంచ్ బియ్యని శివ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీకి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ద్దెల రాజయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజిద్ పాషా, బీసీ సెల్ మండల అధ్యక్షులు అల్లం కుమారస్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడవెన సంపత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోవిందుల పద్మ, సర్పంచ్ లు చిలివేరి జ్యోతి లక్ష్మణ్, మెంగని సమత తిరుపతి, పెగుడ తిరుమల కుమార్, రా పెల్లి రాజయ్య, బొంతల అన్నపూర్ణ ఉపేందర్, గడ్డం రాజేశం, తాని ప్రభాకర్, ఇండ్ల కృష్ణవేణి మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఇందిరమ్మ తొందరగా పూర్తి చేసుకోవాలి...

## - సర్పంచ్ దేవరాజు

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో సర్పంచ్ దేవరాజు ఇందిరమ్మ లబ్ధిదారులతో బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ తొందరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే నాకు తెలియజేయాలని అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లావణ్య లింబాద్రి కార్యదర్శి వెన్నెల వార్డు సభ్యులు నరసయ్య ఇందిరమ్మ లబ్ధిదారులు ఉన్నారు.

# మహిళా శక్తి సంఘాల భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

**సూర్య, వీణవంక**



గ్రామాల్లో మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే మహిళా శక్తి సంఘాల బలోపేతానికి ప్రత్యేక భవనాలు నిర్మిస్తున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో మహిళా శక్తి సంఘాల భవన నిర్మాణానికి అత్యంత వైభవంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మితుకు కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఒక చోట చేరి చర్చించుకోవడానికి, శిక్షణలు పొందడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్, అధికారుల ఐకెపి ఏపిఎం సుధాకర్, సిసిలు వి. తిరుపతి, పి. తిరుపతి, పంచాయతీ సెక్రటరీ రవి, విఓఏ స్వరూప, వీరితో పాటు గ్రామైక్య సంఘం మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హిమ్మత్‌నగర్‌లో మహిళా శక్తి సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో మహిళా సాధికారత దిశగా మరో అడుగు పడింది. గ్రామంలోని మహిళా శక్తి సంఘాల (మహిళా సమాఖ్య) సొంత భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ భవనాన్ని శ్రీ ప్రియ మహిళా గ్రామైక్య సంఘంగా నిర్మించ నున్నారు. గ్రామంలో మహిళా సంఘాలకు ప్రత్యేక భవనం అందుబాటు లోకి వస్తే సంఘం సమావేశాలు నిర్వహించుకోవడానికి, ఇతర కార్యకలా పాలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జడల శ్రీకాంత్, ఉప సర్పంచ్ మ్యాక శ్రీనివాస్, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, వార్డు సభ్యులు చిలువేరు స్వప్న - రమేష్, దాసరి రమేష్, బొంతల రవీందర్, మ్యాక వెంకన్న, గుంపుల రజిత - గట్టయ్య, రౌసాల వినోద, పంచాయతీ కార్యదర్శి రాజు, వీఓ అధ్యక్షురాలు లడె రజిత, దొండపాటి పద్మ, సిసి ఆనంద్, మాజీ ఎంపిటిసి నల్ల మమత - తిరుపతి రెడ్డి, లకోట వెంకన్న, మారం తిరుపతి రెడ్డి, మహిళా సంఘ సభ్యులు లావణ్య, స్వరూప, సరోజన, మౌనిక, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా

## - ఆశీర్వదించండి అండగా ఉండండి

## - వెంకట రాజ్ కుమార్ పోలు సీనియర్ న్యాయవాది ;


**సూర్య కొత్తపల్లి ;**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కంటెస్టెంట్ మెంబర్ వెంకట రాజ్ కుమార్ న్యాయవాదులతో జరిగిన సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను గతంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ లో అనేకమైన పదవులు నిర్వహించి న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేశానని ప్రతి ఒక్కరు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని తన యొక్క సీరియల్ నెంబర్ 190 అని తెలిపారు. ఆలోచించి న్యాయవాదులు ఓటు వేసి గెలిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు న్యాయవాదులు ఉన్నారు.

# మండల కేంద్రంలో కాంప్లెక్స్ సమావేశం

**సూర్య మేడిపల్లి**




మేడిపల్లి మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రాబోయే ఫిబ్రవరి నెల 26వ తేదీన దేశవ్యాప్త మూడవ తరగతి పిల్లలకు జరిగే సర్వే ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ ఉంటుందని, దీని కొరకు మూడవ తరగతి విద్యార్థులకు ఇప్పటినుండే సన్నద్ధం చేయాలని ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీస్ లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ లు గోవ ర్ధన్, రోజా రాణి లు ఆంగ్లంలో, గణితంలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఎలా బోధించాలో వివరించారు. ఈ కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యాధికారి ఆకుల లక్ష్మి నర్సయ్య, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ హమీద్ లు మాట్లాడుతూ మన జగిత్యాల జిల్లాలో మన కాంప్లెక్స్ ను మొదటి స్థానంలో ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో సిఆర్పి చింతకింది చంద్రశేఖర్, మండలంలోని అన్ని గ్రామాల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘన్ముకుల రైతులకు ఊరట

## - గ్రామానికి ఎరువుల విక్రయ కేంద్రం మంజూరు

**సూర్య, వీణవంక**



GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF AGRICULTURE
FORM 'A2'
( See Clause 8 (3) as per FCO, 1985)

LETTER OF AUTHORIZATION TO CARRY ON THE BUSINESS OF SELLING OF FERTILISERS AS A RETAILER DEALER IN THE STATE OF TELANGANA

NEW
Authorization letter No: 3172130
Date of issue: 22/01/2026
Valid up to: 21/01/2031

Application No: FERT-R-260375

Details of the godowns :

| SNo | Name of the godown | C/o | House number / godown number | Street Name, Land Mark | Village | Mandal | Division | District with pincode |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Pacs Veenavanka, Br. Ghanmukhla | Pacs Veenavanka, Br. Ghanmukhla | 4-27 | Ghanmukla, Main Road | Ghanmukla | Veenavanka | Huzurabad | Karimnagar - 505502 |

వీణవంక మండల పరిధిలోని ఘన్ముకుల గ్రామ రైతులకు తీపి కబురు అందింది. గ్రామంలో నూతనంగా ఫర్టిలైజర్ సేల్స్ పాయింట్ (ఎరువుల విక్రయ కేంద్రం) మంజూరైనట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. గత కొంతకాలంగా ఎరువుల కోసం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సేల్స్ పాయింట్ మంజూరుకు కృషి చేసిన హుజురాబాద్ ఏడిఏ సునీత, మండల ఏఓ గణేష్, ప్యాక్స్ సీఈఓ ప్రకాష్ రెడ్డిలకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఖరీఫ్ సీజన్?లో యూరియా కొరత ఏర్పడినప్పుడు, రైతులు చల్లూరు, నర్సింగాపూర్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ కూడా స్టాక్ లేక చాలా మంది ఖాళీ చేతులతో తిరిగి వచ్చేవారు. ఇప్పుడు గ్రామంలోనే కేంద్రం ఏర్పాటు కావడంతో ఆ కష్టాలు తీరనున్నాయి. ఎరువుల విక్రయ కేంద్రంతో పాటు, భవిష్యత్తులో నిల్వ సామర్థ్యం పెంచేందుకు అనుబంధంగా ఒక గోదాం మంజూరు చేయించేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. ?ఈ సందర్భంగా తాజా, మాజీ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, తాజా, మాజీ డైరెక్టర్ కట్కూరి మధుసూధన్ రెడ్డి, మాజీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగిడి సంజీవ రెడ్డి, సర్పంచ్ గాజుల శంకర్, ఉప సర్పంచ్ నాగిడి అనిల్ రెడ్డి తదితరులు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

# ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు

## - కమిషనర్ ముసబ్ అహ్మద్

**సూర్య, హుజురాబాద్**



రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న 30 వార్డుల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 29,531 నమోదు అయ్యాయని, అందులో పురుషులు 14,357, మహిళలు 15,170 మంది, ఇతరులు నలుగురు ఉన్నట్లు ఆయన తెలిపారు. 30 వార్డుల నామినేషన్లు స్వీకరించడానికి గాను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు మొత్తం పది క్లస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్లో ఒక ఆర్ఓ ఒక ఏఆర్ఓ లను నియమించినట్లు ఆయన తెలిపారు. ఒక క్లస్టర్లో మూడు వార్డుల నామినేషన్ పత్రాలను అధికారులు స్వీకరిస్తారని అన్నారు. 28వ తేది నుండి 30వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం జరుగుతుందని అన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తాము నామినేషన్ పత్రాలను పూర్తి చేయడానికి ఎలాంటి సందేహాలు ఉన్నా తీర్చడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు, సందేహాలను నివృత్తి కోసం అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని పూర్తి చేసిన అనంతరం నామినేషన్లను దాఖలు చేయాలని అన్నారు.

# పాఠశాలలో చురుకుగా పనులు.

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండలం గుండారం యుపిఎస్ పాఠశాలలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగు తున్నాయి. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచన మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష డిఎంఎఫ్ టి నిధులు గుండారం పాఠశాలకు కేటాయిం చారు. దీంతో ఆ నిధులతో ఆయా పాఠశాలలో స్టేజి తో పాటు వాహనాల నిలుపు షెడ్డును మంజూరు చేయించగా ఆయా పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. పాఠశాలకు నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు గుండారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉప సర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు దామెర దేవయ్య, పిడుగు ఎల్ఐసి సదయ్య, గరుగంటి కృష్ణ, వడ్లకొండ శంకర్ తదితరులు హర్షం వ్యక్తం చేసి మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సింగరేణి తీసుకుంటుందని....

# అనమ(తి)తు లేని కట్టడాల పరిస్థితి ఏమిటి గురువా...!

### - సుమారు 373 నామం లేని గృహాల గుర్తింపు...? - ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల

### - 60 రోజుల్లో అభ్యంతరాలు తెలపండి

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2 ప్రాజెక్టు విస్తరణ కొరకు రాజాపూర్, ఆదివారంపేట, తెనుగు పల్లెలను తీసుకోవడానికి గృహాలు, భూములు తీసుకోవడానికి నిర్ణయించింది. ఈ మేరకు భూ సేకరణలో మొదటి స్టెపు "ప్రిలిమినరీ నోటిఫికేషన్" ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంథని ఆర్డీఓ కాసబోయిన సురేష్, సింగరేణి భూసేకరణ అధికారి విడుదల చేశారు.

**- రాజాపూర్, ఆదివారంపేట :-**

ఓసీపీ-2 విస్తరణ కొరకు రాజాపూర్ గ్రామ పంచాయతీ పరిధి బుధవారంపేట లో కొంత భాగం ఆదివారంపేట లో కొంత భాగం ఉంది. రాజాపూర్ హామ్లెట్ ఆఫ్ బుధవారంపేట లోని 25 ఎకరాల 31 గుంటలలో 219 మంది నిర్మించుకున్న కట్టడాలను తీసుకోనున్నారు. ఆదివారంపేట లో 14 ఎకరాల 5 గుంటలలో 165 మంది నిర్వాసితులు గృహాలు, బోర్లు, బావులు నిర్మించుకున్నారు. చెట్లు పెంచుకున్నారు. కాగా పి.ఎన్ వెలుబడే నాటికి అనుమతు కట్టడాలు, అనుమతి లేని కట్టడాలు భారీగా వెలిసాయి. దీంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వయంగా వెళ్లి వారించిన గ్రామస్థులు కనికరం లేకుండా అనుమతి లేని గృహాలు భారీగా నిర్మించారు.




**- 373 కు పైగా "అనుమతు గృహాల" నిర్మాణం :-**

కలెక్టర్ ఆధ్వర్యంలో రాజాపూర్, ఆదివారంపేట గ్రామంలో రెవెన్యూ అధికారుల బృందం పర్యటించి గతంలో ఒరిజినల్ గా నిర్మించిన గృహాలకు "రాజాపూర్ ప్రాజెక్ట్ నెంబర్" కేటాయించారు. ఇక అనుమతి లేని అనామతు గృహాలకు రాజాపూర్ టెంపరరీ హౌస్ నెంబర్ కేటాయించారు. మొత్తం 473 గృహాలు అక్రమంగా నిర్మించగా, ఇందులో సింగరేణి 2012లో రిక్విషన్ కు ముందే వందల గృహాలు నిర్మించినట్లు గుర్తించారు. సుమారు 373 గృహాలకు ఎలాంటి అనుమతి లేదు. వీటి పరిస్థితి ఏమిటి అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.

**- తెనుగువాడ(బుధవారం పేట) లో....**

బుధవారంపేట గ్రామ పరిధి తెనుగు వాడలో 30 ఎకరాల 30 గుంటల భూమి తీసుకోవడానికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 9వ తేదీన నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఇందులో 39 గృహాలు ఉన్నట్లు అధికారులు గతంలో గుర్తించారు. నేడు ఇందులో సుమారు 3 వందల గృహాల వరకు వెలిసినట్లు తెల్సింది.

**- 54 గృహాలకు పరిహారం ఇచ్చేది లేదని తేల్చి చెప్పిన కలెక్టర్ :-**

బుధవారంపేట రెవెన్యూ పరిధిలో ఓసీపీ-2 విస్తరణ కొరకు 88 ఎకరాల వ్యవసాయ భూమిని సింగరేణి సంస్థకు కలెక్టర్ అప్పగించారు. 2023లో పిఎన్, 2024 లో అవార్డు పాస్ చేశారు. కాగా ఇందులో అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన 54 గృహాలకు నష్టపరిహారం ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. కాగా రూపాయి ఇచ్చేది లేదని, ఇవన్నీ అక్రమమని కోర్టు కు కలెక్టర్ 3 సార్లు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

**- అక్కెపల్లి లో మిగిలిన గృహం సంగతి ఏమిటి...?**



అక్కెపల్లి లో గృహాలు, భూములు తొలగించడానికి 2014లో ప్రిలిమినరీ నోటిఫికేషన్(పి.ఎన్) జారీ చేశారు. 2016 లో అవార్డు పాస్ అయింది. 125 ఎకరాల భూమిలో 585 గృహాలకు నష్టపరిహారం చెల్లించారు. 90 శాతం గ్రామం ఖాళీ అయింది. ఇక 8వ కాలనీ కి చెందిన ఒక ఎస్టీ కులస్తుల ద్వారా 88 గృహాలు, అల్లూరు(మారేడుపాక) కు చెందిన రెడ్డి కులస్తులు ద్వారా ఒక్కరు 54 గృహాలు, మంథని ప్రాంతానికి చెందిన వారు 60 గృహాలు, బేగంపేట గ్రామస్తులు 30 గృహాలు, ఇతరులు పలువురు గృహాలు నిర్మించుకున్నారు. వీటికి నష్టపరిహారం ఇవ్వడం లేదని తెలిసింది.

**- భూములకు ధర వస్తుందనే అమ్మకంతోనే ఈ కట్టడాలు...?**

ఓసీపీ-2 విస్తరణ కొరకు తీసుకుంటున్న పై గ్రామాల్లో అసలు ఇన్ని అక్రమ కట్టడాలు ఎలా వెలుస్తున్నాయి. గ్రామస్తులు కొందరు తమకు గుంటకు ఎక్కువ ధర వస్తున్నట్లు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో పెద్దంపేట, మంగళపల్లి, రాజాపూర్, లద్నాపూర్, తదితర గ్రామాల్లో ఒక ముఠా తాత్కాలికంగా నిర్మించుకున్న గృహాల ద్వారా నష్టపరిహారం పొంది తిరిగి ఆ కట్టడాలను కూల్చి అదే ఇటుక, అదే కర్రలు, అదే పెంకు గూనలు పట్టుకొని వచ్చి ఇక్కడ నిర్మిస్తున్నారు. తిరిగి నష్టపరిహారం పొందేందుకు భారీగా ప్రణాళికలు వేస్తున్నారు.

# సింగరేణి రిటైర్డ్ అధికారులకు శుభవార్త...నేడు రూ.78 కోట్ల పి.ఆర్.పి చెల్లింపు

### - ప్రస్తుత అధికారులకు రిటైర్డ్ అయితేనే కోర్టు ద్వారా అందే అవకాశం

**సూర్య, సెంటినరీ కాలనీ 07 :**

సింగరేణి సంస్థ లో తమ హక్కు అయిన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్?పీ) ని కోల్పోకుండా రిటైర్డ్ అధికారులు సాధించారు. సుదీర్ఘకాలం కోర్టు ద్వారా పోరాటం చేసి తమ హక్కును కాపాడుకున్నారు. దీని ఫలితమే నేడు సింగరేణిలో 2607 మంది అధికారులకు రూ.78 కోట్లు వారి బ్యాంకు ఖాతాలలో జమ కానున్నాయి. 2007-08 నుండి 2013-14 కాలానికి సింగరేణి అధికారులకు పీఆర్?పీ చెల్లింపుకు గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. వివరాల్లోకి వెళ్ళితే తెలంగాణ హైకోర్టు తీర్పు అమలు...డబ్ల్యూ పి నెంబర్ (1170/2022) రిటైర్డ్ అధికారి ఎ.బుచ్చిప్రసాద్, 341 మంది ఇతర రిటైర్డ్ అధికారులు, నామినీలు దాఖలు చేసిన కేసులో, హైకోర్టు జడ్జి పుల్ల కార్తిక్ 02.02.2024న తీర్పు ఇచ్చారు. 2007-08 నుండి 2013-14 కాలానికి పీఆర్?పీ (పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఒక సంవత్సరం గడిచిన ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయకపోవడంతో రిటైర్డ్ అధికారులు హైకోర్టులో కంటెప్ట్ ఆఫ్ కోర్ట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు తీర్పును అమలు చేయాలని ఆదేశించి ప్రిన్సిపల్ సెక్రటరీ-ఎనర్జీ, తెలంగాణ ప్రభుత్వం హాజరు కావాలని ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం 27.10.2025 తేదీన సింగరేణి సిఅండ్ఎండి కి 2007-08 నుండి 2013-14 కాలానికి పీఆర్పీ చెల్లింపులకు అనుమతి ఇచ్చింది. దీని పర్యవసానంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు 29.01.2026న పీఆర్?పీ చెల్లింపులు చేస్తామని సర్క్యులర్ జారీ చేశారు. సింగరేణి అధికారులు కోల్ ఇండియా మాదిరిగానే 2007-08 నుండి పి.ఆర్.పి చెల్లించాలని మేనేజ్‌మెంట్‌కు విన్నవించారు. సింగరేణి బోర్డు ఈ అభ్యర్థనను పరిశీలించి, రేటింగ్‌లను ఆమోదించి, 2007-08 నుండి పి.ఆర్.పి చెల్లింపులకు తెలంగాణ ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది. అప్పటి నుండి పి.ఆర్.పి మొత్తాలు సింగరేణి ఖాతాలలో ఉంచబడ్డాయి. తద్వారా తెలంగాణ ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం లేదు. అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం 2017 లో 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరాలకు మాత్రమే రేటింగ్?లను ఆమోదించింది. 2007-08 నుండి 2013-14 కాలానికి రేటింగ్?లను విస్మరించింది. ఈ విషయంలో అధికారులు, రిటైర్డ్ అధికారులు తమ ప్రతినిధుల ద్వారా ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ అధికారులకు విన్నవించారు. కానీ ఫలితం లేకపోయింది. చివరకు రిటైర్డ్ అధికారి ఎ.బుచ్చి ప్రసాద్ మరియు 341 మంది రిటైర్డ్ అధికారులు మరియు నామినీలు 2007-08 నుండి 2013-14 కాలానికి పి.ఆర్.పి చెల్లింపులు చేయకపోవడం వల్ల తెలంగాణ ప్రభుత్వం మరియు సింగరేణి చర్యలను సవాలు చేస్తూ రిట్ పిటిషన్ (1170/2022) దాఖలు చేశారు. ఈ కేసులో హైకోర్టు జడ్జి పుల్ల కార్తీక్ 2.2.2024న తీర్పు ఇచ్చి 2007-08 నుండి 2013-14 కాలానికి పి.ఆర్.పి చెల్లించాలని ఆదేశించారు. ఈ తీర్పు అమలయ్యేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ చారిత్రక తీర్పు పట్ల రిటైర్డ్ అధికారులు, ఆన్ రోల్ అధికారులు సంతోషం వ్యక్తం చేసి తెలంగాణ ప్రభుత్వానికి, సింగరేణి మేనేజ్?మెంట్?కు కృతజ్ఞతలు తెలిపారు.సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వాసుదేవరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డిఎల్ఆర్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ జేవీ దత్తాత్రేయులు ఈ తీర్పును స్వాగతించి కృతజ్ఞతలు తెలిపారు.



## టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

**సూర్య మల్యాల**

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉప వైద్యాధికారి డాక్టర్ నీలారపు శ్రీనివాస్ అన్నారు. మల్యాలలో శనివారం జరిగిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ ,రికార్డ్స్ పరిశీలించారు.. లక్ష్యం మేరకు టీబీ నిర్ధారణ పరీక్షలను చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మౌనిక ష్రవ రమేష్ ,ఆరోగ్య పర్యవేక్షకులు మాంకిడి శ్రీనివాస్ , ర్ం శ్రీనివాస్ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



## సమ్మక్క సారలమ్మ స్ఫూర్తితో రాణించాలి.

**సూర్య చందుర్తి**

చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నంత పాఠశాలలో సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని విద్యార్థులచే వారి చరిత్రను, పోరాటం గురించి చెప్పించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సమ్మక్క సారలమ్మ వేషధారణలో మేడారంలో జరుగుతున్న ఆదివాసి గిరిజన జాతర చరిత్రను, ఆదివాసుల సంస్కృతిని అభినయంతో వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్ రజిత మాట్లాడుతూ... మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ఆసియాలోని అతిపెద్ద జాతర. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో సమ్మక్క సారలమ్మ ల వీరమరణానికి చిహ్నంగా జరుగుతుంది. వీరిద్దరూ గొప్ప త్యాగం, వీరత్వం, ఆత్మగౌరవానికి చిహ్నంగా చెప్పుకోవడం జరుగుతుంది. కాబట్టి విద్యార్థులంతా సమ్మక్క సారలమ్మ స్ఫూర్తితో ధైర్య సాహసంతో జీవితంలో గొప్పగా రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్,అర్చిత, తిరులమ, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**- చందుర్తి సర్పంచ్ పులి సత్యం గౌడ్**

**- తిరుమల ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో క్రికెట్ ప్లేయర్స్ కి జెర్సీలు అందజేత**

**సూర్య చందుర్తి**

చందుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, తిరుమల ఫర్టిలైజర్ అధినేత లింగాల మల్లయ్య ఆధ్వర్యంలో చందుర్తి క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా .హాజరైన చందుర్తి సర్పంచ్ పులి సత్యం గౌడ్, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజీమ్ ల చేతుల మీదుగా క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువకులు గ్రామీణ క్రీడల పై ఆసక్తి చూపుతూ, అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు.. తిరుమల ఫర్టిలైజర్స్ వారు గత కొన్ని ఏళ్లుగా గ్రామంలోని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అనేక సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయం చేయడాన్ని కొనియాడారు.. ఈ కార్యక్రమంలో చందుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగాల తిరుమల్, క్రీడాకారులు సాగర్, రాకేష్, మోసిన్, సుబ్బు, యాకూబ్, సిరి, బబ్లు, రాహుల్ తో పాటు క్రికెట్ ప్లేయర్స్ పాల్గొన్నారు.



# సిరిసిల్ల బిఆర్ఎస్ మున్సిపల్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల

### - 18 మంది అభ్యర్థులను ప్రకటించిన ఇంచార్జ్ తుల ఉమ - సామాజిక సమీకరణాలకు పెద్దపీట

**సూర్య రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. బుధవారం నామినేషన్ల పర్వం ప్రారంభం కాగా, అదే రోజు రాత్రి భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) తమ అభ్యర్థుల తొలి జాబితాను వెల్లడించింది. పార్టీ సీనియర్ నాయకురాలు, సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ తుల ఉమ మొత్తం 18 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను అధికారికంగా ప్రకటించారు.



**- వార్డుల వారీగా అభ్యర్థుల వివరాలు:**

3 వ వార్డు జిందం కళ చక్రపాణి, 5 వ వార్డు దర్శం అరుణ లక్ష్మీనారాయణ, 8 వ వార్డు లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, 13 వ వార్డు బుర్ర నారాయణ / రాజు, 16 వ వార్డు గుడ్ల శ్రీనివాస్, 17 వ వార్డు గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్, 21 వ వార్డు ఎల్లుక వెంకటేశం, 9 వ వార్డు దొంతునేని కళ్యాణి అశోక్ రావు, 24 వ వార్డు బుర్ర మల్లికార్జున్, 27 వ వార్డు కాసర్ల పద్మ, 28 వ వార్డు అదిచెర్ల రూప సాయి కృష్ణ, 29 వ వార్డు గెంటియాల శ్యామల శ్రీనివాస్,30 వ వార్డు మంచె రేణుక శ్రీనివాస్, 35 వ వార్డు బతులకు రమేష్, 36 వ వార్డు కల్లూరి రేణుక రాజు, 39 వ వార్డు ఆకుల స్వప్న కృష్ణ, 12 వ వార్డు మోగిలి నాగరాజు, 32 వ వార్డు సయ్యద్ అక్రమ్

**- గెలుపే లక్ష్యంగా వ్యూహాలు**

అభ్యర్థుల ఎంపికలో స్థానికంగా ఉన్న బలా బలాలు, సామాజిక సమీకరణాలను పరిగణన లోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తొలి జాబితాలో మహిళలకు, మరియు బిసి సామాజిక వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యత లభించింది. మిగిలిన వార్డుల అభ్యర్థులను కూడా త్వరలోనే ప్రకటిస్తామని తుల ఉమ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రకటనతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు చీటీ నరసింహారావు,సెస్ చైర్మన్ చిక్కల రామా రావు, పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలి అభ్యర్థులను గెలిపించండి

### - పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్ - కాంగ్రెస్ పార్టీలో చేరలేదని స్పష్టీకరణ

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా పద్మశాలి సామాజిక వర్గ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్లలోని పద్మశాలి సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలు అంతా ఏకమై తమ సామాజిక వర్గ నాయకులను కౌన్సిలర్లుగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. రాజకీయ పార్టీల కంటే సామాజిక వర్గ అభ్యున్నతే తమకు ముఖ్యమని, పద్మశాలీల ఐక్యతను చాటాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు.



**- పార్టీ మార్పు ప్రచారంలో నిజం లేదు**

తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వస్తున్న వార్తలను దూడం శంకర్ ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. తాను ఏ పార్టీలోనూ చేరలేదని, అదంతా తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు. మంగళవారం తాము కేవలం సిరిసిల్లలోని పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం సమస్యలను పరిష్కరించాలని కోరుతూనే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్లను కలిసినట్లు వివరించారు.తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదని, పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నా సామాజిక వర్గానికి న్యాయం చేసే క్రమంలో అన్ని పార్టీల నాయకులను కలుస్తానని ఇందులో రాజకీయ కోణం లేదని దూడం శంకర్ స్పష్టం చేశారు.

**- మార్కండేయ గుడి నిర్మాణానికి సహకరించాలి**

సిరిసిల్ల పట్టణంలో నిర్మిస్తున్న మార్కండేయ దేవాలయ నిర్మాణానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. త్వరలోనే మార్కండేయ గుడి నిర్మాణం కోసం సిరిసిల్ల పట్టణంలో ప్రతి ఇంటికి విరాళాల సేకరణకు సిద్ధమవుతున్నామన్నారు. మార్కండేయ గుడి నిర్మాణమే తన లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు మోర రవి, కార్యవర్గ సభ్యులు గాజుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతగా వుంటేనే రాజ్యాధికార పదవులు సాధిస్తాం

**- ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు చొక్కల రాము**

**- ఇల్లంతకుంట మండల ముదిరాజ్ ఐక్యతనే 7 గురు సర్పంచ్లు**

**సూర్య, ఇల్లంతకుంట**



ముదిరాజ్‌లు ఐక్యతతో వుంటే రాజ్యాధికార పదవులు సాధిస్తామని ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు చొక్కాల రాము అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ముదిరాజ్ ల ఆత్మీయ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎలవేణి రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు చొప్పరి రామచంద్రం,జిల్లా ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు చొక్కల రాములు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, అందుకు నిదర్శనం ఇల్లంతకుంట మండల ముదిరాజులేనని ఐక్యతతోనే ఏడు గ్రామాల సర్పంచులు ఎన్నిక కావడం శుభ పరిణామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లోను ఐక్యతతో ఉండి ఎంపీటీసీ, జెడ్పిటిసిలు, ఎంపీపీలుగా గెలావాలని, ముదిరాజ్ కుటుంబాల పిల్లలను చదివించాలని, చదువుతో నే ఆర్థికంగా రాజకీయంగా ఎదగవచ్చన్నారు.రాష్ట్రీ లో అధిక జనాభా గలది ముదిరాజ్ కులమేనని తెలిపారు. మండల అధ్యక్షులు ఎలవేణి రమేష్,కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి సరుగు నరేష్,సర్పంచ్ లు పండుగ సునీత,గౌరవేణి శ్రీవాణి, కుడుముల రేణుక, చింతమడక కళ్యాణ్, చొప్పరి భూమయ్య, గొడుగు విఠల్, గూడెల్లి స్వప్న,ఉప సర్పంచులు, గౌరవ అధ్యక్షులు కంకటి ప్రభాకర్, కనుకయ్య, బీసీ మహా సంఘం అధ్యక్షులు కూనబోయిన బాలరాజు, మండల కార్యదర్శి కొమ్ముల నర్సింహం, పల్లే రాజశేఖర్, పర్శరాములు, నాగరాజు, ఏంద్ర చందన్, నాయకులు,సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హెల్ప్ లైన్ సెంటర్, కంట్రోల్ రూమ్, మీడియా సెల్ ఏర్పాటు

**- కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 233 1495**

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ప్రారంభం**

**సూర్య రాజన్న సిరిసిల్ల**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్, మీడియా సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, మీడియా సెల్ ను అదనపు కలెక్టర్ బుధవారం ప్రారంభించారు.ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్ ప్రసారమైన, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన వెంటనే స్పందించాలని సూచించారు. ఎన్నికల ఫిర్యాదుల ఉంటే ప్రజలు కంట్రోల్ రూం నెంబర్ 1800 233 1495 అందుబాటులో ఉంటుందని, ఫోన్ చేసి చెప్పవచ్చని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు గీత, శ్రీనివాసాచారి, నవీన్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## తాటి చెట్టు పై నుండి జారిన గీత కార్మికుడు

**- కల్లు గీత కార్మికుడికి తీవ్ర గాయాలు**

**సూర్య చిగురుమామిడి**



చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు సుధగోని సుద ర్శన్ గౌడ్ వయసు 58 వృత్తి నిమిత్తం బుధవారం ఉదయం తాటి చెట్టెక్కి కల్లు తీసుకొని చెట్టు దిగే సమయంలో ప్రమాదవశాత్తు జార దంతో చెట్టుపై నుంచి క్రిందకు జారి పడి పోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కరీంన గర్‌లోని రినో హాస్పిటల్‌కు తరలించారు.సమాచారం తెలుసుకున్న ఉల్లంపల్లి గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ వెంటనే ప్రవేట్ ధవాఖానకు చేరుకొని బాధితుడి పరిస్థితిని పరామర్శించారు. డాక్టర్ల నివేదిక ప్రకారం సుదర్శన్ గౌడ్‌కు తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం సుధాగోని సుదర్శన్ గౌడ్‌కు చికిత్స చేస్తున్నారని సర్పంచ్ తెలిపారు.ఈ సంఘటనతో గీత కార్మికుడి కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమైతున్నారు, వెంటనే ప్రభు త్వము సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని వారి కుటుంబానికి సహాయం అందజేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు, పుల్లంపల్లి గ్రామ ప్రజలు,సర్పంచ్ అల్వాల శంకర్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపన్నగారి మాధవి లత

**- ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**సూర్య, వేములవాడ**

వేములవాడ మున్సిపల్ 28 వార్డుకు చెందిన గోపన్నగారి మాధవి లత బుధవారం రాష్ట్ర ప్రభు త్వం విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని విప్ సూచించారు.గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం వేములవాడ అభి వృద్ధిని విస్మరించిందని అన్నారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

## వ్యక్తి ఆత్మహత్య కి కారణం అయిన కేసులో...

**- 6 గురు నిందితులకు 5 సంవత్సరాలు జైలు శిక్ష**

**- ఒక్కొక్కరికి 2000 రూపాయల జరిమాన**

**సూర్య జగిత్యాల**

కన్న కొడుకును బలవంతంగా దూరం చేసి తీవ్ర మనస్థాపానికి గురిచేసి ఆత్మహత్యకు చేసుకునేలా ప్రేరేపించిన కేసులో నిందితులుగా ఉన్న ఆరుగురికి మెట్పల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి.నాగేశ్వర్ రావు ఐదేళ్ల సాధారణ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసుపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపిన ప్రకారం జగిత్యాల పట్టణానికి చెందిన పెద్దిరాజు కు మల్లాపూర్ మండలశీ, ముత్యశీపేట గ్రామానికి చెందిన సునీత తో 2004 సంవత్సరంలో వివాహం జరిగింది. వారికి మురారి అనే కుమారుడు ఉన్నాడు. సునీత అనారోగ్య కారణాలతో 2011లో ఉరివేసుకుని మృతి చెందింది.సునీత మృతి చెందిన అనంతరం, ఆమె తల్లిదండ్రులు, బంధువులు మురారి ని తీసుకెళ్లి, తండ్రి పెద్దిరాజు కు ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారు. తన కుమారుడిని చూడనివ్వక, దుర్భాషలాడడంతో పెద్దిరాజు తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు.ఈ నేపథ్యంలో పెద్దిరాజు ముత్యశీపేట కు వెళ్లి తన కుమారుడిని ఇవ్వమని కోరగా, నిందితులు అందరూ కలిసి డబ్బులు డిమాండ్ చేస్తూ కుమారుడిని ఇవ్వకుండ అంటూ తీవ్రంగా వేధించడం తో అక్కడే ఉన్న యాసిడ్ సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే అతడిని మొదట మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం జగి త్యాల, కరీంనగర్ ఆసుపత్రులకు తరలించగా, 2011 అక్టోబర్ ఐదు న చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు, సమగ్ర విచారణ అనంతరం నిందితుల వేధింపుల కారణంగానే పెద్దిరాజు ఆత్మ హత్యకు పాల్పడ్డాడని నిర్ధారించారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, సాక్షులను విచారించిన న్యాయమూర్తి ఆరుగురు నింది తులు సింగసాని స్వామి, లక్ష్మి, మహేష్, ఐతరవేని భూమయ్య, రామడుగు రవి,బఫ లక్ష్మిలకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి 2000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నింది తులకు శిక్ష పడేలా కృషి చేసిన సబ్-ఇన్స్పెక్టర్లు శశిధర్ రెడ్డి, సత్యనారా యణ, రాజమౌళి, పి.పి. ఆనంద్, సి ఎం ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ వినోద్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.



# జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పోటీ చేస్తాం

### - తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పోటీ చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశానుసారం బుధవారం రోజున జగిత్యాలలోని న్యూ బస్ స్టాండ్ సమీపంలోని రాజా డిలక్స్ పైన గల తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సాయిని పాపన్న మున్సిపల్ ఎన్నికల నేపత్యంలో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను




విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని అన్ని మున్సిపల్లో పోటీ చేసే అభ్యర్థులకు టి.ఆర్.పి నుండి భీ ఫారం ఇవ్వడం జరుగుతుందని పోటీ చేసే అభ్యర్థులు టి.ఆర్.పి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలగాని శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుమ్ముల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు ఎర్ర రమేష్, సారంగాపూర్ మండల నాయకులు పాలగాని మల్లేష్ యాదవ్, ఈరోజు చేరికలు అయినా పడకంటి శ్రీనివాస్, రెవెల్లా అశోక్, నవోతూ శ్రీనివాస్, మహమ్మద్ అయూబ్ ఖాన్, గంగాధరి లక్ష్మినారాయణ గౌడ్, మాజీ సర్పంచ్ కడమండ మహేష్ ఇతర నాయకులు అకోజు శ్రీధర్, రాచర్ల వెంకటేష్ పాల్గొన్నారు

## పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేయాలని వినతి

**- గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్న సర్పంచ్ అకవరం భవాని శివప్రసాద్.**



**సూర్య చిగురుమామిడి**

చిగురుమామిడి మండల కేంద్రం లోని గ్రంథాలయంలో యువతకు కాంపిటేషన్ పరీక్షలకు కావలిసిన పుస్తకాలు,విద్యార్తులకు కావలిసిన అన్నిరకాల పుస్తకాలను అందుబాటులోనికి తీసుకురావాలని జిల్లా గ్రంథాలయ అధికారిని స్థానిక లైబ్రేరియన్ కు వినతి పత్రం అందజేశారు.ప్రస్తుతం చిగురుమామిడి గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటలో ఉన్నాయని యువతకు తెలిపారు .గ్రంథాలయంలో మూత్రశాలలు లేనందున త్వరలో వాటిని నిర్మాణం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మిరాజు యాదవ్,వార్డుసభ్యులు రాకం అంజవ్వ,శివాంజనేయులు,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ కుటుంబ సభ్యుల ఆర్థిక చేయూత

**సూర్య - పెద్దపల్లి రూరల్**

మండలంలోని కాల్వ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన డీ ఓ శివప్రసాద్ ఇటీవల మరణించగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సభ్యులు సహకారం తో రీజినల్ మేనేజర్ వెంకటరాజం చేతుల మీదుగా కుటుంబానికి రూ .50,000 లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మేనేజర్ సందవేణి మహేందర్, కాల్వ శ్రీరాంపూర్ మేనేజర్ బుర్ర అఖిల్, ఎస్ ఓ లు గంగుల కుమార్, సుధారాణి తదితరులు ఉన్నారు.

## శివాలయ వార్షికోత్సవ వేడుకల్లో సెస్ డైరెక్టర్

**సూర్య, ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి శ్రీ సాయి శివాలయ వార్షికోత్సవ వేడుకల్లో సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నర్రా అంజిరెడ్డి, బాలరాజు, బాల నర్సాగౌడ్ పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## నిరుపేద కుటుంబానికి ఆసరాగా ఎల్ఓసి


**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని చింతల్లపల్లి గ్రామానికి చెందిన కంచె శ్రావ్య అనారోగ్యంతో బాధపడుతూన్న నేపథ్యంలో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అయిదు లక్షల రూపాయల విలువైన ఏల్వోసి చొప్పదండి శాసన సభ్యులు మేడిపెల్లి సత్యం మంజూరు చేయడం జరిగింది అట్టి ఎల్వోసి పత్రాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరి నారాయణ గౌడ్ బాధితురాలు తండ్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరి రాజేష్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి వినోద్ రెడ్డి గుర్రం అనిల్ పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యుత్ డిఈ గా ప్రభాకర్

**సూర్య, సెంటినరీ కాలనీ**




మంథని ఎన్పీడీసీఎల్ విద్యుత్ డిఈ వెగ్గలం ప్రభాకర్ కు వరంగల్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ కంపెనీ సిఅండ్ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి ప్రశంసా పత్రం అందించారు. వరంగల్ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సంధర్భంగా ప్రశంసా పత్రం అందించి అభినందించారు. కంపెనీ లెవెల్ లో మంథని ప్రాంతంలో విద్యుత్ లో వోల్టేజ్ తగ్గించడం, సక్రమంగా విధులు నిర్వహించడం, విద్యుత్ ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో ఈ డివిజన్ కు అప్పట్లో మొదటి స్థానం వచ్చింది. దీనిని పురస్కరించుకొని డిఈ వెగ్గలం ప్రభాకర్ ను సిఅండ్ఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బుస్స అశోక్, పెద్దపల్లి ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ లు అభినందించారు.

## సర్పంచ్ ను పరామర్శించిన కొండూరి రవీందర్ రావు

**సూర్య, ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామా పంచాయతీ సర్పంచ్ ఎలగందుల నరసింహులు తల్లి నరసవ్వ అనారోగ్యంతో బాధపడుతూ మరణించగా బుధవారం నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి వెంట సెస్ డైరెక్టర్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు వరస కృష్ణ హరి, మాజీ ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, గంభీ రావుపేట అధ్యక్షులు పాపగారి వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

## బోర్ వెల్ ఓనర్స్ అసోసియేషన్ కు సహకరించండి

**సూర్య, సెంటినరీ కాలనీ**




పెద్దపల్లి జిల్లా లో బోర్ వెల్ ఓనర్స్ అసోసియేషన్ కు సహకరించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పత్తి దామోదర్ కోరారు. ఈ మేరకు తమ అసోసియేషన్ కు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను పెద్దపల్లి, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. ప్రజల త్రాగు నీటి ఎద్దడి తీర్చడంలో తమ బోర్ వెల్ యంత్రాలు ఎంతో పనిచేస్తున్నాయని దామోదర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పర్వతం మల్లేశం, కళ్యాణం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి చింతల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి పర్వతం డానియల్, కోశాధికారి చింతల కిష్టయ్య, మెంబర్లు సిరిగిరి రమేష్, మోతె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎస్ఎంఎస్ ప్లాంట్ పిఓ గా గుండేటి

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్జీ-3 డివిజన్ లో ఉన్న ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గా డిజిఎం గుండేటి శంకర్ ని యాజమాన్యం నియమించింది. ఈయన ప్రస్తుతం ఆర్జీ-3 ఏరియా సేఫ్టీ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం ఏం.రామ్మోహన్ కు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## 8వ డివిజన్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా అజాహరుద్దీన్ నియామకం

**సూర్య తిమ్మాపూర్**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్(అల్గునూర్) కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మహ్మద్ అజాహరుద్దీన్ నియామక మయ్యారు. ఈ మేరకు బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామకపు పత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో గోపు మల్లారెడ్డి గెలుపు కోసం పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి,మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు రహమత్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ చల్లా రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,మామిడి నరేందర్ రెడ్డి, చిందం కిష్టయ్య, దాసం నాగేందర్ జాప రాఘవరెడ్డి, జాప రవీందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, కొమురయ్య, చిల్ల రాములు, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీకి మొదటి రోజున 11 నామినేషన్లు.

**సూర్య జమ్మికుంట**

వచ్చే నెల 11న జరగనున్న జమ్మికుంట మున్సిపాలిటీ పాలకవర్గం ఎన్నికలలో బుధవారం మొదటి రోజున మొత్తం 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి 30 వార్డులకు జరగనున్న ఈ ఎన్నికలలో మొత్తం 34455 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించనున్నారు ఇందులో పురుషులు16815మంది మహిళలు17639మంది ఉన్నారు బుధవారం మొదటి రోజున పలు వార్డులలో 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి ఇందులో బీజేపీ నుండి 3 కాంగ్రెస్ నుండి 5 బిఆర్ఎస్ నుండి 2 ఇండిపెండెంట్ సభ్యులు 2 నామినేషన్లు దాఖలు చేశారు మున్సిపాలిటీ కార్యాలయంలో మూడు రోజులపాటు కొనసాగనున్న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమానికి పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు

## కొత్తపల్లి కార్పొరేషన్ పరిధిలో ఎక్స్ ప్రెస్ బస్సులను నిలపాలి

**- బీజేపీ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీపీ వాసాల రమేష్**

**సూర్య కొత్తపల్లి**

కొత్తపల్లి పట్టణంలో ఎక్స్ ప్రెస్ బస్సులను ఆర్టీసీ ఆపాలని కొత్తపల్లి మాజీ ఎంపీపీ బిజెపి రాష్ట్ర నాయకులు వాసాల రమేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపెల్లి మాజీ ఎంపీపీ బీజేపీ రాష్ట్ర నాయకులు వాసాల రమేష్ మాట్లాడుతూ గతంలో కొత్తపెల్లి బస్టాండ్ ప్రాంతంలో బస్సులను ఆపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుపోయినప్పటికీ వారు ఆదేశించిన కూడా అధికారులు కొత్తపెల్లి లో బస్సులు ఆపడం లేదు అని అన్నారు. కొత్తపెల్లి పట్టణంలో బస్సులు ఆగకపోవడం వల్ల ప్రయాణికులు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్టీసీ రీజియన్ కు సంబంధించిన ఐదు జిల్లాల పరిధిలోని బస్సులను కొత్తపెల్లి పట్టణంలో ఆపాలని కోరారు. బస్సులు ఆపకపోవడంతో మహిళలు విద్యార్థులు యువకులు ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి బస్సులను నిలవాలని కోరారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ కౌన్సిలర్ స్వర్గం వజ్రా నరసయ్య, చిట్కారి శ్రీనివాస్ ,కారం రవి ప్రసాద్ ,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అబ్దుల్ రహీంకు పరామర్శ

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ రాజనర్సింహారెడ్డి, టియుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు అబ్దుల్ రహీం తల్లి షేఫియాబేగం ఇటీవల చనిపోగా బుధవారం గంభీరావుపేటలోని తన స్వగృహంలో పరామర్శించారు. వీరి వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగ రాజారాం రెడ్డి తదితరులు ఉన్నారు.

## ంపు గాలిపల్లి లో సీఎం కప్ క్రీడల పోటీల నిర్వహణ.

**- ఎంపిడిఓ శశికళ.**

**సూర్య, ఇల్లంతకుంట**

రేపు(శుక్రవారం)మండలం లోని గాలిపల్లి లో సిఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడలను ప్రభుత్వం నిర్వాహిస్తున్నట్లు ఎంపిడిఓ శశికళ బుధవారం ప్రకటనలో తెలిపారు.